## మగువలకు ఉపశమనం..
## భారీగా తగ్గిన వెండి..?
ప్రస్తుతం వెండి ధర భారీగా తగ్గింది. అలాగే బంగారం కూడా తగ్గుముఖం పట్టింది. మధ్యప్రా చ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వంటి అంశాలు బంగారం ధరల పై ప్రభావం చూపుతున్నాయి. ఇక బంగారం, వెండి ధరల విషయంలో ఎప్పుడు ఎలా ఉంటాయో చెప్పడం కష్టమనే చెప్పాలి. దేశీయ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల నడుమ మన సూచీలు నష్టాల బాట పట్టాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్? ఎఫెక్ట్‌కు రెండు రోజుల లాభాలు ఆవిరవుతున్నాయి.



ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 శుక్రవారం 1 ఆగస్టు 2025 సంపుటి: 01, సంచిక : 86



విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## అవి డెడ్ ఎకానమీలు



- రష్యా, భారత్‌లపై నోరు పారేసుకున్న ట్రంప్
- జట్టుకట్టి మరింత దిగజారుతున్నాయని విమర్శ
- ఆ రెండు దేశాల వాణిజ్య బంధాన్ని పట్టించుకోనని వ్యాఖ్య

# మూడు నెలల్లో తేల్చండి



- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో నిర్ణయం తీసుకోండి
- తెలంగాణ స్పీకర్ కార్యాలయానికి సుప్రీంకోర్టు ఆదేశాలు
- అనర్హతలపై నిర్ణయాధికారం స్పీకర్‌దేనని స్పష్టీకరణ
- అలాగని తామెలాంటి ఆదేశాలూ ఇవ్వకపోతే 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్' అన్నట్టవుతుందని వ్యాఖ్య
- అనర్హతల విషయంలో స్పీకర్‌కున్న నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునఃపరిశీలించాలని సూచన
- ఫిరాయింపులు అడ్డుకోకపోతే ప్రజాస్వామ్య పునాదులకే ముప్పంటూ ఆందోళన....

**సూర్య న్యూఢిల్లీ**


పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం శాసనసభ స్పీకర్‌కే ఉందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తెలంగాణలో పార్టీ మారి అనర్హత పిటిషన్లు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విషయంలో తీర్పు వెలువరించిన రోజు నుంచి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ సభాపతి కార్యాలయానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అనర్హత పిటిషన్లు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఎవరూ విచారణను ఆలస్యం చేయడాన్ని అనుమతించకూడదని పేర్కొంది. విచారణను ఆలస్యం చేసేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తే తీవ్రంగా పరిగణించాలని చెప్పింది. మరోవైపు అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునః పరిశీలించాలని సూచించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన - మిగతా2లో



# సవరణపై సభా సమరం

- బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ఆపాల్సిందేనన్న విపక్షాలు
- ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకోవాలంటూ డిమాండ్
- కొనసాగిన విపక్షసభ్యుల ఆందోళనలు, నినాదాలు
- అర్ధంతరంగా వాయిదాపడిన ఇరుసభలు

## పతనమైంది భారత ఆర్థికం కాదు.. మీ రాజకీయ భవిష్యత్తు



- ప్రధాని మోదీ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థను చంపేశారు
- ప్రతి ఒక్కరికీ తెలుసు భారత ఆర్థిక వ్యవస్థ మరణం అంచున ఉంది
- భారత ఆర్థిక వ్యవస్థను మోదీ దాన్ని నాశనం చేశారు.
- నోట్ల రద్దు , జీఎస్టీ, నిరుద్యోగాన్ని ఉదహరించారు.
- కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ

## కమిషన్ వేయాలా? వద్దా? తేలుస్తాం

'భూదాన్' కేసులో తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు



**సూర్య హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూదాన్ భూముల అన్యాక్రాంతం, అక్రమాల ఆరోపణలపై విచారణ కమిషన్ వేయాలా? వద్దా? అనేది తేలుస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేసింది. - మిగతా2లో

# కబ్జా స్థలాల్ని స్వాధీనం చేసుకుంటాం

- హైదరాబాద్‌లో 131 ఎకరాల ఇరిగేషన్ భూముల కబ్జా
- వాటి స్వాధీనానికి ఇరిగేషన్, హైడ్రా, రెవెన్యూ శాఖలు కలిసి పనిచేయాలి
- క్వార్టర్లలో అక్రమంగా తిష్టవేసిన వారిని ఖాళీ చేయించాలి
- ప్రాజెక్టుల స్థలాల్లో సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును పరిశీలించాలి
- నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణపై సమీక్షలో మంత్రి ఉత్తమ్




**సూర్య హైదరాబాద్**

ఆక్రమణలకు గురైన తమ శాఖ భూముల్లో అంగుళం స్థలాన్ని కూడా వదలిపెట్టకుండా యుద్ధప్రాతిపదికన స్వాధీనం చేసుకుంటామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రూ. వందల కోట్ల విలువైన భూములు కబ్జాలకు గురయ్యాయని.. దీన్ని ఉపేక్షించకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. భవిష్యత్తులో ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు ఆ భూముల చుట్టూ కంచెల ఏర్పాటుతో పాటు చట్టపరమైన చర్యలూ తీసుకుంటామని చెప్పారు. నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణపై సచివాలయంలో గురువారం ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుస్సేన్, ఈఎన్సీ అడ్మిన్ రమేశ్ - మిగతా2లో



## కదం తొక్కుతున్న కృష్ణమ్మ

- శ్రీశైలం ప్రాజెక్టుకు 2,73,659 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- సాగర్‌లో 26 గేట్ల నుంచి నీటి విడుదల

## దేశ ప్రయోజనాలను పరిరక్షిస్తాం

- ట్రంప్ ప్రకటించిన అదనపు టారిఫ్ భారంపై తగు చర్యలు తీసుకుంటాం
- పార్లమెంట్‌లో వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ భరోసా

## కొత్త తరానికి చేరువవుదాం!



- విద్యార్థులు, యువత లక్ష్యంగా పార్టీ కార్యాచరణ
- ఎర్రవల్లి నివాసంలో ముఖ్యనేతలతో కేసీఆర్
- అన్ని జిల్లా కేంద్రాల్లో విస్తృత స్థాయి భేటీలు... రేవంత్ సర్కారును టీడీపీ, బీజేపీ నడిపిస్తున్నాయి
- కరీంనగర్ బీసీ సభ ద్వారా కాంగ్రెస్‌ను ఎండగట్టాలి
- ఫిరాయింపుదారులపై చర్య తీసుకునేలా ఒత్తిడి చేద్దాం
- స్థానిక ఎన్నికలపై దృష్టి పెట్టండి

# ఉపాధి పనులు కుది'రాయి'!

- అన్నం పెడుతున్న గ్రానైట్ రాయి
- మహబూబాబాద్ జిల్లాలో 50 గ్రానైట్ క్వారీలు
- జిల్లావ్యాప్తంగా వేలాది మందికి ఉపాధి
- దేశ, విదేశాలకు గ్రానైట్ రాళ్ల ఎగుమతులు

**సూర్య హైదరాబాద్ / నెల్లికుదురు**

మహబూబాబాద్ జిల్లాలో భారీగా నిర్వహిస్తున్న గ్రానైట్ క్వారీలతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. పలు మండలాల్లో గ్రానైట్ క్వారీ పరిశ్రమలు కొనసాగుతున్నాయి. 40 ఏళ్లుగా అంతర్జాతీయంగా పేరుగాంచిన మెడివెస్ట్ గ్రానైట్, గాయత్రి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్.. జిల్లాలోని ఇనుగుర్తి మండలం చిన్ననాగారం, మీఠ్యతండా, కేసముద్రం మండలం తీగలవేణి, అర్పపల్లి గ్రామాల్లో క్వారీలను నిర్వహిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో విస్తరించిన 50 గ్రానైట్ క్వారీ పరిశ్రమల్లో.. ఎంతో మందికి ఉపాధి దొరుకుతోంది. మేనేజర్ నుంచి వాచ్‌మన్ వరకు స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలు ఒడిశా, అస్సాం, బిహార్ రాష్ట్రాల నుంచి వేలాది మంది ఉద్యోగులు, కార్మికులకు ఉపాధి దొరుకుతోంది. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం, కేసముద్రం మండలం అర్పనపల్లి, తీగలవేణి, కేసముద్రం, నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న క్వారీల నుంచి తీస్తున్న బ్లాక్ గ్రానైట్ - మిగతా2లో



# మూడు నెలల్లో తేల్చండి

-మొదటిపేజీ తరువాయి

న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసుకు సంబంధించి స్పీకర్‌కు ఆదేశాలు జారీచేయడం రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ లక్ష్యాన్ని నీరుగార్చుతుంది. అలాగని మేం ఇప్పుడు ఏ ఆదేశాలూ జారీ చేయకపోతే.. 'ఆపరేషన్ సక్సెస్%–%పేషెంట్ డెడ్' అన్నట్లుగా ఉంటుంది. స్పీకర్ తన ప్రస్తు త వైఖరిని పునరావృతం చేయడానికి దోహదపడినట్లు అవుతుంది..

**ఏడు నెలలు.. 9 సార్లు విచారణ**

పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై త్వరగా చర్యలు తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 15న బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్‌లు స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పి) దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు దాఖలైన తర్వాత దాదాపు ఏడు నెలల్లో తొమ్మిది సార్లు సుప్రీంకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, మోహిత్ రావు, స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, తదితరులు వాదనలు వినిపించారు. గత ఏప్రిల్ 3న విచారణ ముగించి తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం.. గురువారం తీర్పు వెలువరించింది.

**ఎంత సమయం కావాలని ముందే అడిగాం..**

'2025 జనవరి 15న సుప్రీంకోర్టు ముందు కేసు దాఖలైన తర్వాత 16న తొలిసారిగా మేం కొందరికి నోటీసులు జారీ చేశాం. ఫిబ్రవరి 3న జరిగిన విచారణ సందర్భంగా.. ఫిబ్రవరి 4న మరికొందరికి నోటీసులు జారీ చేశాం. జనవరి 31న తొలుత ఈ కేసు విచారణకు వచ్చినప్పుడే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్‌కు ఎంత సమయం అవసరమో తెలుసుకోవాల్సిందిగా మేము సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గికి సూచించాం..' అని ధర్మాసనం తెలిపింది.

**'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ నాట్ డెడ్'లా ఉండాలి**

'10 షెడ్యూల్ కింద స్పీకర్ ట్రిబ్యునల్‌గా పని చేస్తున్నప్పటికీ, ఆయన ఎటువంటి రాజ్యాంగపరమైన రక్షణ (కానిస్టిట్యూషనల్ ఇమ్యూనిటీ)ను పొందలేరు. నిజానికి ఈ కేసును విచారించిన సింగిల్ జడ్జి అనర్హత పిటిషన్లపై విచారించేందుకు సమయాన్ని నిర్ణయించమని స్పీకర్‌కు సూచించారు. అందుకు నాలుగు వారాల గడువిచ్చారు. అంతేకానీ పిటిషన్లపై నిర్ణయం తీసుకోమని ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. అయినప్పటికీ.. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకుని సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని చెప్పడం ద్వారా డివిజన్ బెంచ్ తప్పిదానికి పాల్పడింది. ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు లేకపోయినా తెలంగాణ శాసనసభ కార్యదర్శి సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేయడం సరైంది కాదు. ఇకపై ఈ కేసు 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ నాట్ డెడ్' లా ఉండాలి..' అని సుప్రీంకోర్టు (నవ్వుతూ) వ్యాఖ్యానించింది.

**విచారణను పొడిగించేందుకు అనుమతి వద్దు**

'అనర్హత పిటిషన్లను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణను పొడిగించడానికి స్పీకర్ అనుమతించకూడదు. స్పీకర్ నిర్ణయాలపై న్యాయ సమీక్షకు అధికారాలు (కిహోటో హోల్లోహాన్ (10వ షెడ్యూల్ సమర్థించిన) కేసులో తీర్పు నిష్పత్తిని ప్రస్తావిస్తూ) ఇరుకైన పరిధిలో (న్యారో కంపాస్) ఉన్నాయి. అలాగే స్పీకర్ నిర్ణయాలు న్యాయ సమీక్షకు పూర్తిగా అతీతం కాదు. స్పీకర్లు అనర్హత పిటిషన్లను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచే పరిస్థితిని రాజ్యాంగ ధర్మాసనం ఊహించి ఉండకపోవచ్చు. అనర్హత పిటిషన్లను స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయించాలని కీషమ్ మేఘచంద్ర సింఘ్ కేసులో తీర్పు ఉంది. శివసేన, ఎన్సీపీ ఎమ్మెల్యేల ఫిరాయింపుల పిటిషన్లను నిర్ణీత సమయంలోగా నిర్ణయించాలని మహారాష్ట్ర స్పీకర్‌కు జారీ అయిన ఆదేశాలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది..' అని న్యాయమూర్తులు తెలిపారు.

**జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం**

'అనర్హత పిటిషన్లపై నిర్ణయాధికారం స్పీకర్‌కే ఇచ్చాం. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో స్పీకర్ తగిన సమయంలో స్పందించాల్సిన అవసరం ఉంది. అయితే అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునఃపరిశీలించాలి. రాజకీయ ఫిరాయింపులు అనేవి జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం. మనం దీనిని ఎదుర్కొనకపోతే ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది..' అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. అనర్హతల విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునః పరిశీలించాలి. రాజకీయ ఫిరాయింపులు అనేవి జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం. వీటిని ఎదుర్కొనకపోతే మన ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. 10 షెడ్యూల్ కింద స్పీకర్ ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ..ఆయన ఎటువంటి "రాజ్యాంగపరమైన రక్షణ"ని పొందలేరు. అనర్హత పిటిషన్లను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణను స్పీకర్ పొడిగించుకుంటూ పోవడానికి వీల్లేదు..

బీఆర్ఎస్ నేతల అభ్యర్థన తోసిపుచ్చిన ధర్మాసనం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టే నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు చేసిన అభ్యర్థనను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. కిహోటో హోల్లోహన్, సుభాష్ దేశాయ్ తదితరుల కేసులకు సంబంధించి రాజ్యాంగ బెంచ్ తీర్పును ప్రస్తావించింది. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉందని స్పష్టం చేసింది.

'అయితే, ఫిరాయింపులు జరిగినప్పుడు అనర్హత అంశాన్ని తేల్చే ముఖ్యమైన బాధ్యతను స్పీకర్‌కు లేదా చైర్మన్‌కు అప్పగించే యంత్రాంగం వల్ల రాజకీయ ఫిరాయింపులను సమర్థవంతంగా అరికట్టగలుగుతున్నామా.. లేదా? అనే అంశాన్ని మాత్రం పార్లమెంట్ పరిశీలించాలి. ప్రజాస్వామ్య పునాదులు బలంగా ఉండాలంటే, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలంటే ప్రస్తుత యంత్రాంగం సరిపోతుందా? లేదా? అనే విషయం కూడా పార్లమెంటే తేల్చాలి..' అని ధర్మాసనం స్పష్టం చేసింది. అనర్హత పిటిషన్లపై తేల్చే అత్యంత ముఖ్యమైన బాధ్యతను పార్లమెంట్ స్పీకర్‌కు అప్పగించినప్పుడు ఆ హోదాలో ఉన్నవారు ఎంతవేగంగా చర్యలు తీసుకున్నారనేది ప్రధానమని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

**షెడ్యూల్ 10 ఏం చెబుతోంది..**

ఇది పార్టీల నుంచి ఫిరాయింపులను నిరోధించడానికి రూపొందించింది. దీన్ని ఫిరాయింపుల నిరోధక చట్టం అని కూడా అంటారు. రాజకీయ స్థిరత్వం, ప్రజాస్వామ్య ప్రక్రియ పరిరక్షణ, విలువలను కాపాడటం కోసం దీన్ని ఉద్దేశించారు. ప్రజాప్రతినిధులు పార్టీలు ఫిరాయించకుండా నిరోధించడం దీని ముఖ్య ఉద్దేశం. దీని ప్రకారం..పార్టీ ఆదేశాలు చట్టసభల సభ్యులు పాటించాలి. పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా ఓటు వేసినా లేదా పార్టీ నుంచి వైదొలిగినా చట్టసభల సభ్యులను అనర్హులుగా ప్రకటించవచ్చు. ఫిరాయింపుల అంశాల్లో కోర్టులకు అధికార పరిధి ఉండదు. స్పీకర్ లేదా చైర్మన్ నిర్ణయమే అంతిమం. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరితే సభలో సభ్యుడిగా ఉండటానికి అనర్హుడు. ఒకవేళ ఒక పార్టీ మరో పార్టీలో పూర్తిగా విలీనమైతే అనర్హత వర్తించదు. సభ్యుని అనర్హతపై ఏ కోర్టుకు అధికార పరిధి ఉండదు.

# కొత్త తరానికి చేరువవుదాం!

హైదరాబాద్

ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పదేళ్లపాటు అధికారంలో కొనసాగి ప్రస్తుతం ప్రతిపక్ష పాత్రకు పరిమితమైన బీఆర్ఎస్ కొత్త తరానికి చేరువ అయ్యేందుకు అనుసరించాల్సిన వ్యూహానికి పదును పెడుతోంది. తెలంగాణ అస్తిత్వ పోరాటాలు, రాష్ట్ర సాధన ఉద్యమంలో బీఆర్ఎస్ పాత్ర, నదీ జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన ఆవశ్యకత తదితరాలను విద్యార్థులు, యువతకు నూరిపోయాలని భావిస్తోంది. టీఆర్ఎస్‌గా ఆవిర్భవించి గత 25 ఏళ్లుగా బీఆర్ఎస్ సాగిస్తున్న ప్రస్థానం, ఉద్యమ నాయకుడిగా, ప్రభుత్వాధినేతగా కేసీఆర్ చేసిన కృషిని వివరించాలని భావిస్తోంది. ఈ నెల 26న హైదరాబాద్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే విస్తృత స్థాయి సమావేశం తరహాలో అన్ని జిల్లా కేంద్రాల్లోనూ సదస్సులు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. దీంతోపాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా కేసీఆర్ ఎర్రవల్లి నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితోపాటు మరికొందరు నేతలతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. గురువారం భేటీలో కీలక అంశాలపై చర్చించడంతోపాటు పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

**ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం తీర్పు**

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేసీఆర్ చర్చించారు. ఒకవైపు స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధమవుతూనే పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని కేటీఆర్‌ను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల్లో స్థితిగతులను మథింపు చేసి నివేదిక రూపొందించాలని సూచించారు. మరోవైపు మూడు నెలల్లోగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌పై ఒత్తిడి పెంచేందుకు అనుసరించాల్సిన వ్యూహంపైనా ఈ భేటీలో చర్చించారు.

**బనకచర్లతో జరిగే నష్టంపై..**

నదీ జల్లాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించడంతోపాటు ప్రత్యేకించి గోదావరి%–%బనకచర్ల లింకు ప్రాజెక్టుతో రాష్ట్రానికి జరిగే నష్టంపై యువత, విద్యార్థులకు వివరించాలని కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. ఆగస్టు 1న మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సమావేశం నిర్వహిస్తున్నారు. సూర్యాపేట, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లోనూ త్వరలో ఈ తరహా సమావేశాలు జరుగుతాయి.

అన్ని జిల్లా కేంద్రాల్లో సదస్సులు నిర్వహించే బాధ్యతను బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బాల్క సుమన్, గాదరి కిషోర్, ఎర్రోల్ల శ్రీనివాస్‌కు అప్పగించారు. జల వనరుల నిపుణులు వి.ప్రకాశ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ సదస్సుల్లో ప్రసంగిస్తారు. రాష్ట్రంలో రేవంత్ సర్కారును టీడీపీ, బీజేపీ నడిపిస్తున్నాయనే విషయాన్ని విడమరిచి చెప్పాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కాంగ్రెస్, బీజేపీ ఉమ్మడిగా బీఆర్ఎస్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలను విడమరిచి చెప్పాలని సూచించారు.

**దృష్టి మళ్లించేందుకే విచారణలు**

ఎన్నికల హామీల అమలు, పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలు, వాటిని ఎదుర్కొనాల్సిన తీరుపై కేసీఆర్ లోతుగా విశ్లేషించినట్లు సమాచారం. కాళేశ్వరం, విద్యుత్ అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్లు తదితరాలపై ఈ భేటీలో చర్చ జరిగింది. కాళేశ్వరం కమిషన్ విచారణకు తాను, హరీశ్ హాజరుకావడం ద్వారా ప్రజల్లో నెలకొన్న అపోహలు పటాపంచలు అయినట్లు కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కాళేశ్వరం కమిషన్ నివేదికలో ఏయే అంశాలు ఉండొచ్చనే కోణంలోనూ చర్చ జరిగినట్లు సమాచారం.

**బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు**

బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంలో కాంగ్రెస్ పార్టీ తాను తీసుకున్న గోతిలో తానే పడిందని, బయటపడే మార్గం కోసం వెతుకుతూ మరింత లోతుగా కూరుకుపోతోందనే అభిప్రాయం కేసీఆర్ భేటీలో వ్యక్తమైంది. కాంగ్రెస్ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 8న కరీంనగర్‌లో నిర్వహించే బీసీ సభ ఏర్పాట్ల బాధ్యతను మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు అప్పగించారు. పార్టీ బీసీ నేతలు మధుసూదనాచారి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, బండా ప్రకాశ్ శుక్రవారం కరీంనగర్‌కు వెళ్లి సభ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించాలని కేసీఆర్ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాల వారీగా సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం తదితరాలకు సంబంధించి కేసీఆర్ పలు సూచనలు చేసినట్లు తెలిసింది. కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు జిల్లాల వారీగా కీలక నేతలు సమన్వయం చేసుకోవాలని కేసీఆర్ సూచించారు.

# విద్య వైద్యానికి పెద్దపీట

కూసుమంచి

తమ ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి రూ.5.50 కోట్ల ఖర్చుతో నిర్మించ తలపెట్టిన జూనియర్ కళాశాల పనులకు శంకుస్థాపన చేశారు. పొంగులేటి స్వరాజ్యం, రామచంద్రయ్య ట్రస్టు ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యనభ్యసిస్తున్న 80 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ.. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. పిల్లల్లో నైపుణ్యం పెంపుదలకు స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో వెనకబడిన పాలేరు నియోజకవర్గాన్ని విద్య పట్ల అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. గత 20 నెలల్లోనే రూ.470 కోట్లు మంజూరు చేశామని, వాటిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా గురుకులం, రూ.208 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాల, రూ.5.5 కోట్లతో జూనియర్ కళాశాల, తిరుమలాయపాలెంలో రూ.2.70కోట్లతో హాస్టల్ మంజూరు చేశామని ఆయన చెప్పారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బందులున్నా పేదపిల్లలను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో కంప్యూటర్ ట్రైనింగ్ ట్యూటర్ల నియామకానికి రూ.3లక్షలు మంజూరు చేశారు. విద్యార్థినులు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే తమ ట్రస్టు ద్వారా సైకిళ్లు అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

## కమిషన్ వేయాలా? వద్దా? తేలుస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఈ సర్వే నంబర్లలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు భూములను అక్రమంగా తమ పేరిట నమోదు చేసుకున్నారని, వీటిపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని దాఖలైన మరో పిటిషన్‌లోని మధ్యంతర అప్లికేషన్ల(ఐఏ)లో తీర్పు వాయిదా వేసింది. భూకబ్జాలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, దీనిపై విచారణ కమిషన్ వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్, పడమటి తండాకు చెందిన రాములు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మళ్లీ విచారణ చేపట్టారు.

**తెలియకుండా భూములు మార్చేశారు..**

పిటిషనర్ తరఫున డాక్టర్ జె.విజయలక్ష్మి వాదనలు వినిపిస్తూ.. '194/ఐ, 195/ఐలో రాములు భూములున్నాయి. ప్రస్తుతం ఆ భూములు అతని అధీనంలోనే ఉన్నాయి. పాస్‌బుక్ అతని పేరిటే ఉన్నా.. భూభారతిలో మాత్రం జావేద్, ఆర్షియా సుల్తానా, అబ్దుల్ లతీఫ్ పేర్లు చూపిస్తోంది. తనకు తెలియకుండా ఆన్‌లైన్‌లో ఎలా మార్చారో చెప్పాలని తహసీల్దార్‌ను కోరినా వివరాలు ఇవ్వలేదు. కోర్టు ఆదేశించినా స్పందనలేదు. కమిషన్ వేస్తే గానీ వివరాలు బహిర్గతం కావని కోర్టును ఆశ్రయించాం'అని తెలిపారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. 'కమిషన్ వేస్తారు.. నివేదిక వస్తుంది, అది కూడా ఉన్నతాధికారులకు సమర్పించాల్సిందే, అప్పుడు కూడా ఆ నివేదికను అల్మారాలో పెట్టి వదిలేస్తే ఏం చేస్తారు'అని ప్రశ్నించారు. మళ్లీ కోర్టును ఆశ్రయించాల్సిందేనని న్యాయవాది బదులిచ్చారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వ్యక్తిగత అంశాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడం సాధ్యం కాదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేశారు.

## పాధి పనులు కుది'రాయి'!

మొదటిపేజీ తరువాయి

సిరులు కురిపిస్తోంది. ఇది ఖరీదైన గ్రానైట్‌గా పేరొందింది. ఈ గ్రానైట్‌ను హైదరాబాద్ నుంచి విదేశాలకు తరలిస్తున్నారు. కాగా రాజ్యసభ సభ్యుడు, గాయత్రి గ్రానైట్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ వద్దిరాజు రవిచంద్ర కూడా దేశ, విదేశాలకు నల్ల గ్రానైట్‌ను ఎగుమతి చేస్తున్నారు.

యంత్రాల విడిభాగాలతో ఉపాధి

భూగర్భం నుంచి గ్రానైట్ ఖనిజ సంపద తీయడానికి ఉపయోగించే యంత్రాల విడిభాగాలను సరఫరా చేస్తూ కూడా ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. గ్రానైట్ బండలను లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తారు. అక్కడ పెద్ద పెద్ద యంత్రాలతో టైల్స్‌గా కట్ చేయడం, పాలిష్ చేసి విదేశాలకు సరఫరా చేయడం వరకు అంతా ఉపాధి లభిస్తుంది. గ్రానైట్ క్వారీల పరిధిలోని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి.

## కబ్జా స్థలాల్ని స్వాధీనం చేసుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

బాబు, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. కాల్వలకు ఇరువైపులా ఉన్న భూములతోపాటు ప్రాజెక్టుల స్థలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

**కోర్టుల్లో వాదనలకు ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది..**

హైదరాబాద్‌లోని గండిపేట, రాజేంద్రనగర్ పరిధిలోని హిమాయత్‌సాగర్, కిస్మత్‌పుర, వాలంతరి, ఇంజనీరింగ్ ల్యాబ్ (టీజీఈఆర్ఎల్)కు చెందిన 426.3 ఎకరాలకుగాను 131.31 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఐటీఐఆర్ ఆధీనంలోని 81.26 ఎకరాల స్థలంపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా మిగిలిన 50.13 ఎకరాలు కబ్జాకు గురయ్యాయన్నారు. వాటిపై జిల్లా కోర్టులో 20 కేసులు, హైకోర్టులో 2 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. భూముల పరిరక్షణలో న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదిని నియమించాలని నిర్ణయించామన్నారు. ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు నీటిపారుదల శాఖ, హైడ్రా, రెవెన్యూ, ఆర్ అండ్ ఆర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించామని చెప్పారు.

**నీటిపారుదల భూముల్ని గుర్తించండి..**

నీటిపారుదల శాఖ ప్రాజెక్టులకు సంబంధించిన క్వార్టర్లలో అక్రమంగా నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి తక్షణమే సమగ్ర సమాచారం తన ముందు ఉంచాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల శాఖ భూములను సత్వరం గుర్తించాలన్నారు. తమ శాఖ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ఇటీవలి మంత్రివర్గ సమావేశంలో చర్చించామన్నారు. దీంతో రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలకు అవసరమైన విద్యుత్‌ను నీటిపారుదల శాఖ స్వయంగా ఉత్పత్తి చేసుకోవచ్చని చెప్పారు.

## కదం తొక్కుతున్న కృష్ణమ్మ



దోమలపెంట/నాగార్జునసాగర్

శ్రీశైలం ప్రాజెక్టుకు గురువారం రాత్రి 7 గంటల సమయంలో 2,73,659 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. జూరాల ప్రాజెక్టు స్పిల్‌వే ద్వారా 1,79,316 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 25,205, సుంకేసుల నుంచి 69,138 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. దీంతో ఎనిమిది గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2,16,152 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,764 క్యూసెక్కులు.. మొత్తం 66,079 క్యూసెక్కుల నీళ్లు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.7 అడుగుల నీటిమట్టం వద్ద 202.9673 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 31,000 క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,818, ఎంజీకేఎల్ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

**సాగర్‌లో కృష్ణమ్మ పరవళ్లు**

ఎగువ నుంచి వరద భారీగా వస్తుండటంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వస్తున్న నీటితో.. సాగర్ నుంచి 26 క్రస్ట్‌గేట్ల ద్వారా, విద్యుదుత్పాదనతో కలిపి మొత్తం 2,25,595 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 585 అడుగులు (297.4350టీఎంసీలు) ఉంది.

# సవరణపై సభా సమరం



న్యూఢిల్లీ

కేంద్ర ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన వివాదాస్పద ఓటర్ల జాబితా సమగ్ర సవరణ క్రతువును తక్షణం నిలిపివేయాలన్న విపక్షాల డిమాండ్లతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లిపోయాయి. గురువారం ఉదయం రాజ్యసభలో సభాకార్యకలాపాలు మొదలవగానే విపక్షసభ్యులు తమ డిమాండ్లను నినాదాల రూపంలో వినిపించారు. ఆపరేషన్ సిందూర్‌పై 16 గంటల చర్యకు ప్రధాని మోదీ ఎందుకు రాజ్యసభలో సమాధానం ఇవ్వలేదని విపక్ష సభ్యులు ప్రశ్నిస్తూ సభాకార్యకలాపాలను అడ్డుకున్నారు. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఈసీ వెంటనే ఆపేయాలనీ విపక్ష సభ్యులు డిమాండ్‌చేశారు. దీంతో సభను సభాధ్యక్షుడు మధ్యాహ్నం 2 గంటలవరకు వాయిదావేశారు.

తర్వాత సభ మొదలైనా మళ్లీ ఇదే విపక్షాల డిమాండ్ల పర్వం కొనసాగింది. వెంటనే ప్రధాని మోదీ సభకు వచ్చి ఆపరేషన్ సిందూర్‌పై సమాధానం ఇవ్వాలని విపక్ష సభ్యులు నినాదాలుచేశారు. ఈ సందర్భంగా రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు సభాధ్యక్షుడు సస్మిత్ పాత్రా అనుమతించారు. “ 2008లో ముంబై ఉగ్రదాడులపై నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభలో వివరణ ఇవ్వనప్పుడు నాట హోం మంత్రి వివరణ ఇచ్చారు. అంతేగానీ హోం మంత్రి అమిత్ షా లాగా “ నేనొక్కడినే మీ అందరినీ అదమాయించగలను. హ్యాండిల్ చేస్తాను” అని అందర్నీ తూలనాడలేదు. ఇప్పటికైనా ప్రధాని మోదీ సభకు వచ్చి మాట్లాడాలి” అని ఖర్గే డిమాండ్‌చేశారు. ఈయన మాటలకు విపక్షసభ్యులు గొంతు కలిపారు. దీంతో చేసేదిలేక సభను సాయంత్రం నాలుగున్నర గంటలదాకా వాయిదావేశారు. 4.30 గంటలకు సభ మొదలయ్యాక ట్రంప్ చేసిన ‘డెడ్ ఎకానమీ’ వ్యాఖ్యలకు వాణిజ్యమంత్రి గోయల్ ఘాటుగా స్పందిస్తూ ప్రకటనచేశారు. అయినాసరే విపక్షసభ్యులు తమ నినాదాలను ఆపకపోవడంతో చివరకు సభను శుక్రవారానికి వాయిదావేశారు.

**లోక్‌సభలోనూ అదే తీరు..**

లోక్‌సభలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. లోక్‌సభ ఉదయం మొదలుకాగానే జీఎస్‌ఎల్‌వీ రాకెట్ ద్వారా నైసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన శాస్త్రవేత్తలకు సభ అభినందించింది. తర్వాత వెంటనే బిహార్ అంశంపై విపక్ష సభ్యులు నినాదాలు మొదలెట్టారు. “ ఇలా నినాదాలు చేయడానికి మనల్ని ఓటర్లు ఓట్లేసి గెలిపించుకున్నారా? దయచేసి మీమీ సీట్లలో కూర్చోండి” అని లోక్‌సభ స్పీకర్ బిర్లా మందలించారు. అయినా విపక్షసభ్యులు వినిపించుకోలేదు. తొలుత రెండు గంటల దాకా సభ వాయిదాపడింది. తర్వాత ఇదే పునరావృతంకావడంతో అప్పుడు సభాధ్యక్ష స్థానంలో కూర్చున్న అవదేశ్ ప్రసాద్ సభను నాలుగు గంటలకువాయిదావేశారు. నాలుగు గంటలకు సభ మొదలవగానే మంత్రి పియూశ్ గోయల్ మాట్లాడారు. ఆ తర్వాత నినాదాలు కొనసాగడంతో స్పీకర్ బిర్లా సభను శుక్రవారానికి వాయిదావేశారు.

# అవి డెడ్ ఎకానమీలు

వాషింగ్టన్/న్యూఢిల్లీ/మాస్కో

ఆంక్షలు విధిస్తామ ని భయపెట్టినా గత కొంతకాలంగా రష్యా నుంచి భారీ ఎత్తున చమురు కొనుగోళ్లను తగ్గించుకోని భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్‌కు చమురును సరఫరాచేస్తున్న శత్రు దేశం రష్యాను సైతం ట్రంప్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. భారత్, రష్యా రెండూ కలిసి సాధించేది ఏమీ ఉండదని ఎద్దేవాచేశారు. జట్టుకట్టి అనవసరంగా రెండు దేశాల ఆర్థికవ్యవస్థలను మరింత నిర్వీర్యంచేస్తున్నా యని ఇరు దేశాల ప్రభుత్వాలపై విమర్శల బురద చల్లారు. భారత్‌పై పాతికశాతం టారిఫ్ ఆర్థిక భారం మోపిన ట్రంప్ గురువారం భారత్, రష్యాల వాణిజ్యబంధంపై తన అక్కసును వెళ్లగక్కుతూ సొంత సామాజిక మాధ్యమం ‘ట్రూత్ సోషల్’లో పలు పోస్టులు పెట్టారు.

**ఐ డోంట్ కేర్..**

“ రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటోందీ, రష్యాతో భారత్‌కు ఉన్న సత్సంబంధాలు ఏంటి అనేవి నాకు అస్సలు అవసరం లేదు. అత్యంత కీలకమైన అమెరికాతో వాణిజ్యం అత్యల్ప స్థాయిలో చేసుకుంటూ భారత్ సొంత ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యంచేసుకుంటోంది. ఇక రష్యా సంగతి చెప్పనక్కర్లేదు. రష్యాతో అమెరికాకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవు. ఇలాంటి రష్యా, భారత్‌లో కూడబలుక్కుని సాధించింది ఏమీ లేదు. అవి రెండూ డెడ్ ఎకానమీలు (నిర్వీర్యమైన ఆర్థిక వ్యవస్థలు). ఉమ్మడిగా పతనమవుతున్నాయి. ఈ దేశాలను నేనసలు పట్టించుకోను. భారత్‌తో మేం చాలా తక్కువ స్థాయిలో వాణిజ్యం చేస్తున్నాం. భారత్ మాపై విధించే అధిక టారిఫ్‌లే ఇందుకు ప్రధాన కారణం. భారత్ విధించే దిగుమతి సుంకాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ప్రపంచంలో అత్యధిక దిగుమతి సుంకాలు వసూలుచేస్తున్న దేశాల్లో భారత్ కూడా ఒకటి. భారత్‌తో వ్యవహారాలు ఒక్కోసారి సవ్యంగా ఉండవు. దాని పర్యవసానమే ఈ 25 శాతం దిగుమతి సుంకాలు. వీటికి పెనాల్టీ(జరిమానా) అదనం. ఇవన్నీ ఆగస్ట్ ఒకటో తేదీ నుంచి అమలుచేసి వసూలు మొదలెడతా” అని ట్రంప్ వ్యాఖ్యానించారు. “భారత వాణిజ్య విధానాలు అసంపూర్ణంగా, అస్పష్టంగా ఉంటాయి. దానికితోడు భారత్‌తో పరస్పర సరుకుల విలువను మాత్రమే జమకట్టే నగదుయేతర వాణిజ్య అవరోధాలు చాలా ఉన్నాయి. మేం వద్దు అని వారిస్తున్నా, హెచ్చరిస్తున్నాసరే రష్యా నుంచి ఆయుధ, ఇంధన ఉత్పత్తులను భారీ ఎత్తున భారత్ కొనుగోలుచేస్తోంది. ఇలా వచ్చిన ఆదాయాన్ని పరోక్షంగా ఉక్రెయిన్ యుద్ధం కోసం రష్యా వినియోగిస్తోంది” అని ట్రంప్ ఆరోపించారు.

**మెద్వెదేవ్, ట్రంప్ మాటల యుద్ధం**

భారత్‌ను విమర్శించిన ట్రంప్ పనిలోపనిగా రష్యాపైనా, రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్‌పైనా విమర్శలు గుప్పించారు. దీంతో మెద్వదేవ్ సైతం ప్రతివిమర్శలు చేశారు. తొలు త మెద్వదేవ్‌నుద్దేశిస్తూ ట్రంప్ వ్యంగ్య పోస్ట్ చేశారు. “రష్యా అధ్యక్షుడిగా పేలవంగా పాలించిన మాజీ అధ్యక్షుడు మెద్వదేవ్ ఇంకా రష్యాకు అధ్యక్షుడినే అని అనుకుంటున్నారేమో. ఏదైనా మాట్లాడేముందు చూసి మాట్లాడండి. అమెరికాపై మాట్లాడే దుస్సాహసం చేయొద్దు” అని హెచ్చరించారు. దీనిపై రష్యా భద్రతా మండలి ఉపాధ్యక్షుడి హోదాలో మెద్వదేవ్ ఘాటుగా జవాబిచ్చారు. “ట్రంప్ ఎలా స్పందించినాసరే రష్యా తన పంథాను వీడబోదు. డెడ్ ఎకానమీ అని నోటికొచ్చినట్లు మాట్లాడటంకాదు. సోవి యట్ కాలంలోనే రష్యా అణుబాంబును తయా రుచేసిందన్న విషయం మర్చి పోవద్దు. అయినా ‘డెడ్’ అనే పదానికి ‘ది వాకింగ్ డెడ్’ అనే సినిమాకు, ‘డెడ్ హ్యాండ్ అనే ‘వ్యవ స్థ’కు ఉన్న శక్తి ట్రంప్‌కు తెలీదనుకుంటా” అని మెద్వదేవ్ వ్యాఖ్యానించారు. శత్రుదేశం దాడిచేసి రష్యా నా యక త్వాన్ని అంతమొందించినాసరే తిరిగి అణు బాంబులు ప్రయోగించేలా రష్యా రూపొందించిన ఆటో మేటిక్ దాడి వ్యవస్థ పేరే డెడ్ హ్యాండ్.

# బీసీ రిజర్వేషన్ల సాధనకు కలిసి రండి

వికారాబాద్, పరిగి



ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లని.. అందుకే వారి కోసం పాదయాత్ర చేస్తున్నామని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగిలో కాంగ్రెస్ చేపట్టిన జనహిత పాదయాత్ర, రోడ్‌షోలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి ఆమె గురువారం పాల్గొన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ నుంచి పరిగి పట్టణం వరకు ఆరు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక కొడంగల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో మీనాక్షి మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కేంద్రంతో పోరాడుతున్నామని, ప్రజలు సైతం ఇందులో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణలో జరుగుతోందని తెలిపారు.

**65 వేల ఉద్యోగాలిచ్చాం..**

పాదయాత్రలకు కాంగ్రెస్ పెట్టింది పేరు అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ పాలనలో చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చాక 65 వేల ఉద్యోగాలిచ్చామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో మరో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తమ అధినాయకత్వం డిమాండ్ చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముఖం చాటేస్తోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పూర్తి చేసి తీరుతామని స్పష్టంచేశారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, బి.మనోహర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ చైర్మన్ రామచల్ల సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


## పతనమైంది భారత ఆర్థికం కాదు.. మీ రాజకీయ భవిష్యత్తు



న్యూఢిల్లీ

ఇండియన్ ఎకానమీ డెడ్ ఎకానమీ అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల్ని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ సమర్థించారు. ప్రధాని మోదీ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థను చంపేశారని సంచలన కామెంట్స్ చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. చనిపోయింది భారత్ ఆర్థిక వ్యవస్థ కాదని.. రాహుల్ గాంధీ రాజకీయ జీవితం అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ట్రంప్ భారత్‌పై అనూహ్యంగా భారీ టారిఫ్ బాంబు విసిరారు. భారత దిగుమతులపై ఏకంగా 25 శాతం సుంకాలు బాదారు. అంతేగాక వీటికి అదనంగా రష్యాతో వర్తకం చేస్తున్నందుకు భారత్‌పై ప్రత్యేకంగా జరిమానా కూడా విధించనున్నట్టు పేర్కొన్నారు. ఫలితంగా భారత్,రష్యాల ఎకానమీ డెడ్ ఎకానమీ అని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో మీడియాలో మాట్లాడారు. ట్రంప్ వ్యాఖ్యలతో రాహుల్ గాంధీ ఏకీభవిస్తూ.. ‘ప్రతి ఒక్కరికీ తెలుసు భారత ఆర్థిక వ్యవస్థ మరణం అంచున ఉంది. భారత ఆర్థిన వ్యవస్థను మోదీ దాన్ని నాశనం చేశారు. నోటు రద్దు , జీఎస్టీ, నిరుద్యోగాన్ని ఉదహరించారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు భారత విజయాలను అవమానపరిచేలా ఉన్నాయి. భారత్ ఎకానమీ కాదు.. మరణించింది రాహుల్ గాంధీ రాజకీయ విశ్వసనీయత. విదేశీ వ్యతిరేకులకు మద్దతుగా మాట్లాడుతున్నారు. ప్రపంచ దేశాల్లో మోదీ ప్రజాదరణను జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. సంబిత్ పాత్రా రాహుల్ గాంధీ ఏ దేశ పక్షాన ఉన్నారనే అనుమానం వ్యక్తం చేశారు. కర్ణాటక బీజేపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఇండియన్ ఎకానమీ డెడ్ ఎకానమీ కాదు..రాహుల్ గాంధీ రాజకీయ భవిష్యత్తు’ అని అన్నారు. ఇంతలో బీజేపీ నాయకులు భారత్‌ను ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివర్ణిస్తూ, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ అంచనాలను ప్రస్తావించారు

## దేశ ప్రయోజనాలను పరిరక్షిస్తాం



న్యూఢిల్లీ

అరడజను సార్లు అమెరికా, భారత ప్రతినిధులు భేటీ అయినా చర్చలు ఓ కొలిక్కిరాకపోవడంతో విసుగుచెందిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా, ఇష్టారీతిక విధించిన 25 శాతం దిగుమతి సుంకంపై భారతసర్కార్ పార్లమెంట్ సాక్షిగా స్పందించింది. భారతదేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తామని లోక్‌సభ, రాజ్యసభలో వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. నేటి నుంచి 25 శాతం టారిఫ్‌లతోపాటు పెనాల్టీలను భారత్‌పై మోపుతానని ట్రంప్ బుధవారం ప్రకటించిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ, రాజ్యసభల్లో గోయల్ కీలక ప్రకటక చేశారు. “ హఠాత్తుగా ఏకపక్షంగా ట్రంప్ మనపై అదనపు టారిఫ్‌లను మోపారు. దీని దుష్ప్రభావాలపై విస్తృతస్థాయి అధ్యయనం చేస్తున్నాం. ఇందులోభాగంగా టారిఫ్‌ల భారం పడే రైతులు, ఎగుమతిదారులు, కార్మికులు, వ్యాపారులు, సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, పలు పరిశ్రమల సమాఖ్యలు, సంఘాలతో మంతనాలు జరుపుతున్నాం. పెను ప్రభావం తాలూకు పరిణామాలపై విశ్లేషణ చేపడుతున్నాం. దేశ ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్నాం. పౌర ప్రయోజనాల పరిరక్షణకు పాటుపడతాం” అని గోయల్ అన్నారు. “ కేవలం దశాబ్దకాలంలోనే దుర్భల ఆర్థిక వ్యవస్థ నుంచి సుదృఢ ఆర్థికవ్యవస్థగా భారత్ అవతరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్ తయారైంది. 11వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ ర్యాంక్ నుంచి టాప్%–%5 ర్యాంక్‌లోకి భారత్ ఎగబాకింది. మన కర్షకులు, కార్మికులు, సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమల కృషి, మా ప్రభుత్వ పట్టుదల ఈ ప్రగతికి కారణం. భవిష్యత్తులో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయం. ప్రపంచ తయారీరంగ హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దేందుకు గత దశాబ్దకాలంగా కృషిచేస్తున్నాం. మేక్ ఇన్ ఇండియా పథకం ద్వారా భారతీయ ఉత్పత్తుల గణనీయ పెరుగుదలకు పాటుపడ్డాం. నైపుణ్య మానవ వనరులు, యువత కారణంగానే భారతీయ పరిశ్రమల్లో పోటీతత్వం, నవకల్పనలు ఎక్కువయ్యాయి. గత 11 సంవత్సరాలుగా మన ఎగుమతులు పెరుగుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బ్రిటన్, ఆస్ట్రేలియాలతో భారత్ లాభదాయకమైన వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. రైతులు, భారత సాగు రంగం బాగు కోసం, ఆహార భద్రత కోసం ప్రభుత్వం పాటుపడుతోంది. ఇకమీదటా అదే పనిచేస్తాం. అమెరికా టారిఫ్‌ల అంశంలో భారత ప్రయోజనాలకు పణంగా పెట్టే ప్రసక్తే లేదు” అని గోయల్ వ్యాఖ్యానించారు.

**డెయిరీ విషయంలో మరింత అప్రమత్తంగా..**

డెయిరీ రంగానికి సంబంధించి ప్రభుత్వం ఇంతవరకూ ఏ దేశంతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదర్చుకోలేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 కోట్ల జనాభా దేశ సాగురంగంపై ఆధారపడిన నేపథ్యంలో ఆహారభద్రత సంక్షోభంలో పడకుండా ప్రభుత్వం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. అందులోభాగంగానే ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా సాగురంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా ప్రభుత్వం ఓ కంట కనిపెడుతోంది. 2021%–%25 వాణిజ్యగణాంకాల ప్రకారం భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. భారత్ నుంచి మొత్తం ఎగుమతుల్లో దాదాపు 18 శాతం ఎగుమతులు అమెరికాకే వెళ్తున్నాయి.

# భారత జాతీయోద్యమ పిత

బాలగంగాధర తిలక్ (జూలై 23, 1856 – ఆగస్టు 1, 1920) స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యాగమూర్తులతో బాలగంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహానేత లోకమాన్య తిలక్. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు. బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్య నభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయులలో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లో–వెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్య సించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువు తున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రు దయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలస ప్రభుత్వాన్ని లొంగదీయ లేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: "మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)" అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3–డే తమాషాగా అభివర్ణించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజ్‌పత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసు కున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్–బాల్–పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటైనారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరచి భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి "దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ"ని స్థాపించారు. తర్వాత తాను నడిపిన పత్రికలు "మరాఠా (ఆంగ్ల పత్రిక)", "కేసరి (మరాఠీ పత్రిక)" లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశారు. బాల్య వివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం మొదలు పెట్టారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో ఆయనకు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదల య్యాక అతను స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆయనకు ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే అతను "గీతారహస్యం" అనే పుస్తకం రాశారు. తిలక్ చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని ఆయన అభిప్రాయం. భగవద్గీతపై ఆయన రచించిన భాష్యం–856 పేజీల గీతా రహస్యం అనే ఉద్గ్రంథం మొదటి కూర్పు ఆరు వేల ప్రతులు ఒక పక్షంలోనే అమ్ముడు పోయాయంటే అది ఎంత ప్రజాభిమానమైన గ్రంథమో స్పష్టం అవుతున్నది. అన్ని భారతీయ భాషల్లో దాని అనువాదాలు వెలువడ్డాయి. 1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్‌ని స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్య భారత దేశంలో గ్రామ గ్రామాన తిరిగారు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్‌లో మొదలుపెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొన సాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో ఆయన లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు "బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారత దేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచ డానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్ని వ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించారు. బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేయగా, ఆ ప్రకటన స్పష్టంగా లేక పోవడంతో, తిలక్ విభేదించగా, ఇద్దరు నాయకులదీ చెరొక దారి కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడి పోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. అందుకే 1920లో ఆగస్టు 1వ తేదీన తిలక్ మరణం తో జాతీయోద్యమం చుక్కాని లేని నావ అవుతుందని చాలా మంది భయపడ్డారు.

# తల్లిపాలకు మించిన ఆహారం లేదు

పిల్లలకు తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమనీ, చంటి పిల్లలకు చనుబాలిస్తేనే తల్లికి జన్మ ధన్యమైనట్లనీ, పాలిచ్చేతల్లి ఉంటే చంటిపిల్లలకు ఇక ప్రపంచంలో ఏమీ అవసరం లేదనీ ఒకనాడు భావించే వారు. పిల్లల్ని కనడం, పాలివ్వడం ఒక వరంగా, మాతృత్వానికి పరాకాష్టగా భావించేవారు ఆనాడు. తల్లిపాల ద్వారా ప్రపంచం లోని క్షీరదాలు తమ పిల్లలను తమ పాలతోనే పెంచుతున్నప్పటికీ, ప్రకృతి సహజంగా ప్రసాదించిన తల్లి పాలను ఉపయోగించుకోక పోవడం మానవజాతి పరిణామంలో ఒక చిత్రాతి చిత్రమైన పరిస్థితి. నేడు వివిధ కారణాల వల్ల తల్లిపాలకు ప్రత్యమ్నాయం అనుసరించడం అత్యంత బాధాకరం. తల్లిపాలను భారత దేశంలో కేవలం 37 శాతం మంది పిల్లలే ఆరునెలల వరకు తాగుతున్నారు. అంటే పిల్లలకు ఎంత తక్కువ పాళ్ళల్లో తల్లి పాలు అందిస్తున్నారో అర్థం అవుతోంది. కారణం తల్లిపాల గొప్పతనం తెలియక పోవడం కావచ్చు, కొంతమంది వక్షోజాలు అందం తగ్గుతుందనో, లేదా ఇచ్చే వెసులుబాటు లేకపోవడమో కానీ చాలామంది శిశువులకి తల్లిపాల రుచి అందడం లేదు. నిజానికి చనుబాలు పిల్లలకు ప్రత్యేక ఔషధంగా పనిచేస్తాయి. తల్లిపాలను సరిగ్గా పిల్లలకు ఇవ్వగలిగితే ఏటా 8.23 లక్షల మంది పిల్లలను ఐదేళ్ల లోపు మరణించకుండా కాపాడు కోవచ్చు. పిల్లలకు చనుబాలు ఇవ్వక పోవడం వల్ల, రొమ్ము కేన్సర్లతో మరణిస్తున్న మహిళల సంఖ్య 20 వేల వరకు ఉంది అంటే ఈ సమస్య ఎంత ఎక్కువగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తల్లి పాల విశిష్టతను తెలిపే రీతిలో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగష్టు నెల మొదటి వారం రోజులు తల్లిపాల వారోత్సవాలుగా వాబా (వరల్డ్ అలైన్స్ ఫర్ బ్రెస్ట్ ఫీడింగ్ ఎక్షన్ ) సంస్థ పర్యవేక్షణలో డబ్ల్యు. హెచ్.ఓ, యునిసెఫ్, బి.పి.ఎన్.ఐ వంటి అంతర్జాతీయ, జాతీయ సంస్థల అనుబంధంగా జరుపు తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. పుట్టిన పసి పిల్లలకు శక్తితో పాటు, శారీరక అనారోగ్య సమస్యలు, మానసిక పరమైన సమస్యలను తల్లి పాలు దరిచేర నియ్యవు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వకుంటే భవిష్యత్తులో పలు విధాలైన ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శిశువుకు తల్లిపాలను మించిన ఆహారం లేదు. ప్రోటీన్లు, విటమిన్లతో కూడిన తల్లిపాలను తాగించినప్పుడే బిడ్డ ఆరోగ్యంగా పెరగ గలుగుతుంది. తల్లి పాలలో కార్బోహైడ్రేట్స్ 7.1%, ఫాట్స్ 4.5%, ప్రోటీన్స్ 0.9%, మినరల్స్ 0.2%, డైజెస్టివ్ ఎంజైమ్స్, హార్మోన్లు, విటమిన్లు, యాంటీ బాడీలు, లింఫోసైట్లు ఉంటాయి. అందుకే తల్లిపాలను తప్పని సరిగా తాగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేస్తోంది. కన్న





బిడ్డకు తల్లిపాలు పట్టించడం చాలా అవసరం. తల్లి పాలు తాగడం వల్ల పుట్టిన బిడ్డ రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కనుక బిడ్డకు కనీసం ఆరు నెలలు నిండే వరకైనా తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. మార్గదర్శకాల ప్రకారం 6 నెలల తర్వాత చనుబాలు మరిచి పోయేలా చేసి మరో ప్రత్నామ్నాయ ఆహారం ఇవ్వడం ప్రారంభించాలి. బిడ్డకు అవసరమైన పోషకాలు తల్లిపాల ద్వారా లభించాక, ఇతర ఆహారాల ద్వారా పిల్లలకు పోషకాలను అందించాలి. తల్లి బిడ్డకు తన చను పాలు ఇవ్వడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుంది. అంతేకాకుండా తల్లికి కూడా మేలు జరుగుతుంది. తల్లిపాలు పట్టించడం వల్ల శిశుకు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ, డయేరియా, వాంతుల సమస్య నుంచి రక్షణ లభిస్తుంది. పిల్లలు పెద్దయ్యాక ఊబకాయం, మరికొన్ని ఇతర అనారోగ్య సమస్యల ముప్పు తగ్గుతుంది. తల్లికి రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. ప్రసవమయిన మొదటి రోజు నుండీ నాలుగు రోజుల వరకూ రొమ్ముల నుండీ చిక్కటి పసుపు పచ్చటి ద్రవం స్రవిస్తుంది. దీనిని కొలోస్ట్రమ్ లేదా "ముర్రుపాలు" అంటారు. ఆ తర్వాతే తెల్లటి పాలు వస్తాయి. ఈ ముర్రుపాలు శిశువులకు చాలా ముఖ్యం. మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా బిడ్డకు జీర్ణకోశ సంబంధిత సమస్యలు ఉండవు. జీర్ణకోశ వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. చాలా తేలికగా అరుగుదల జరుగుతుంది. బిడ్డకు మలబద్ధక సమస్య ఉండదు. తల్లిపాల వలన ఆస్తమా, చెవి సంబందించిన వ్యాధులు రాకుండా కాపాడుతుంది. తల్లిపాల వలన... స్థూలకాయం ఉండదని శాస్త్రవేత్తల పరిశోధన వలన తేలింది. తల్లిపాలు... పిల్లల దశలో లుకేమియా వ్యాధి రాకుండా, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి పెద్ద వయస్సులో రాకుండా కాపాడుతుంది. తల్లిపాలు – పిల్లల తెలివి తేటలను పెంచుతుంది. తల్లి పాలలో చాలా ఫాటీ ఆసిడ్స్ ఉన్నందున, ఇవి పిల్లలలో మెదడు పెరుగుదలకు ఉపయోగ పడుతుంది. తల్లి పాలకు ఖర్చు పెట్టవలసిన అవసరం లేదు. తల్లి ఒడిలో బిడ్డ ఉన్నందున బిడ్డ చాలా అనుకూలమైన స్థితిలో ఉంటుంది. తల్లి బిడ్డల మధ్య బాంధవ్యం పెరుగుతుంది. అలాగే తల్లికి కల లాభాలలో తల్లిపాలు ఇచ్చినందు వలన తల్లికి ప్రసవానంతర సమయంలో బరువు తగ్గుటకు దోహద పడుతుంది. మానసిక వత్తిడిని తగ్గించి బాలింత దశలో రక్తస్రావాన్ని తగ్గిస్తుంది. తల్లికి రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ లాంటివి రాకుండా స్త్రీని కాపాడుతుంది. ఎంత ఎక్కువ కాలం తల్లి బిడ్డకు పాలు ఇస్తే అంత మంచిది. వ్యాధులు నుండి అంతే ఎక్కువ కాపాడుతుంది. ఆవు లేక గేదె పాలు తీసుకున్న పిల్లలు ఎక్కువ అలర్జీ సమస్యలకు గురి అవుతారు.

# జీవశాస్త్ర పితామహులు భార్గవ



పుష్ప మిత్ర భార్గవ ( ఫిబ్రవరి 22, 1928 – ఆగష్టు 1, 2017) (పి.ఎం.భార్గవ) భారత దేశపు అగ్రశ్రేణి శాస్త్రవేత్తల లో ఒకరు. సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సిసిఎంబి) వ్యవస్థాపక డైరెక్టర్. భారత దేశంలో ఆధునిక జీవశాస్త్రం వాస్తుశిల్పిగా ప్రసిద్ధి చెందారు. భారత దేశంలో బయోటెక్నాలజీ రంగంలో మార్గదర్శకుడు మరియు "జెనెటిక్ ఇంజనీరింగ్" అనే పదాన్ని ఉపయోగించిన మొదటి వ్యక్తులలో ఒకరు. 70 వ దశకంలో బయో టెక్నాలజీ విభాగం ఏర్పాటులో భార్గవ కీలక పాత్ర పోషించారు. ఆయన హైదరాబాదులో మెడికల్ అవేర్ మరియు రెస్పాన్సిబుల్ సిటిజన్స్ ఛైర్మన్ కూడా. భార్గవ 1928 ఫిబ్రవరి 22 న అజయ్మేరు ( రాజస్థాన్ ) లో ఒక మధ్య తరగతి కుటుంబం లో, వైద్యుడు, ప్రజారోగ్య నిపుణుడైన రామ్ చంద్ర భార్గవ, గాయత్రి భార్గవ దంపతులకు జన్మించారు. 29ఏళ్ళప్రాయం లో కుటుంబం వారణాసికి మారగా, నేరుగా తొమ్మిదవ తరగతికి నేరుగా బెసెంట్ థియోసాఫికల్ స్కూల్లో చేరారు. పాఠశాల తర్వాత, అతను ఆ సమయంలో ఉత్తర ప్రదేశ్‌లోని ఉత్తమ సంస్థలలో ఒకటైన క్వీన్స్ కాలేజీ నుండి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 1944 లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ తో బీఎస్సీ, 1446లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ అలాగే 1949 లో 21 సంవత్సరాల వయస్సులో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీ హెచ్ డీ పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి 1950 నుంచి 1953 మధ్య కాలంలో ప్రస్తుతం ఉన్న ఐఐసీటీలో, ఉస్మానియా యూనివర్సిటీలో పరోశధకుడిగా పనిచేశారు. తర్వాత 1953 నుంచి 56 వరకు అమెరికా వెళ్ళి అక్కడి యూనివర్సిటీ ఆఫ్ విస్కానిసన్, మెడిసన్‌లో ప్రఖ్యాత శాస్త్రవేత్త హెడెల్ బర్గర్‌తో కలిసి విస్తృతమైన పరిశోధనలు చేశారు. 1956– 57 వరకు లండన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ రిసెర్చ్‌లో పనిచేసి, 1977లో ఇండియాకు వచ్చి తిరిగి హైదరాబాద్‌లోని సెంట్రల్ లాబొరేటరీస్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో చేరారు. తర్వాత ఐఐసీటీలో పనిచేస్తూనే, ఆధునిక జీవశాస్త్ర విభాగాలలో పరిశోధన సంస్థ అయిన హైదరాబాద్ సెంటర్ ఆఫ్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీని స్థాపించారు. 1977 ఏప్రిల్ 1 న అది సెమీ అటానమస్ కేంద్రంగా స్థాపించ బడింది. 1990 లో డైరెక్టర్ పదవి నుంచి రిటైర్ అయ్యారు. భార్గవ యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జర్మనీలలో పనిచేశారు. 50 కి పైగా దేశాలలో పర్యటించారు. భార్గవ భారత ప్రభుత్వ విధానాల గురించి బాగా తెలిసిన వ్యక్తి. నేషనల్ నాలెడ్జ్ కమిషన్‌లో వైస్ ఛైర్మన్ పదవిని పొందారు. జాతీయ భద్రతా సలహా మండలిలో సభ్యుడిగా, భారత ప్రభుత్వ జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీలో భారత సుప్రీంకోర్టు నామినీగా పనిచేశారు. భార్గవ చాలాకాలంగా సైన్స్ మరియు హేతుబద్ధతను ప్రోత్సహించడంలో, మూఢనమ్మకాలను వ్యతిరేకించడంలో పాలు పంచు కున్నారు. 1946 లో శాస్త్రవేత్తల ట్రేడ్ యూనియన్‌గా స్థాపించబడిన అసోసియేషన్ ఆఫ్ సైంటిఫిక్ వర్కర్స్ ఇన్ ఇండియాతో సంబంధం కలిగి ఉన్నారు. 1976 లో 42 వ రాజ్యాంగ సవరణలో భారతదేశ పౌరుల ప్రాథమిక విధిగా శాస్త్రీయ స్వభావాన్ని పొందు పరచడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. అంతర్జాతీయం గా గుర్తింపు పొందిన మాలిక్యులర్ బయాలజిస్ట్ గా ఆయన అందించిన సేవలకు గాను 1986లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. భార్గవ 100 కి పైగా జాతీయ మరియు అంతర్జాతీయ గౌరవాలు, పురస్కా రాలను అందుకున్నారు. భార్గవ వేలాది ఉపన్యాసాలు ఇచ్చారు. 550 కి పైగా ప్రముఖ వ్యాసాలు, ఆరు పుస్తకాలు రాశారు. 125 కి పైగా శాస్త్రీయ పత్రాలను ప్రచురించారు. హైదరాబాదు లోని ఉప్పల్‌లోని ఐదు అంతస్తుల నివాసంలో ఒక అంతస్తును పరిశోధన శాలకు, మరో అంతస్తును లైబ్రరీకి కేటాయించారు. ఇటీవల వరకూ ఆయన అనేక ఫార్మా కంపెనీలకు సలహాదారుగా పని చేశారు. ఆయన సంభవన ట్రస్ట్, భోపాల్, మరియు ప్రాథమిక పరిశోధన, విద్య మరియు అభివృద్ధి సంఘం, న్యూఢిల్లీలో 2005 మరియు 2007 మధ్య నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం



ఏర్పడ్డాక దేశ వ్యాప్తంగా అసహనం, దళితులపై దాడులు పెరిగి పోతున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ.. 2016లో పద్మభూషణ్ అవార్డును వెనక్కి ఇస్తున్నట్టు ప్రకటించారు. భారత ప్రభుత్వం విశ్వ విద్యాలయాలలో అకడమిక్ కోర్సులను ప్రవేశపెట్టాలని మరియు జ్యోతిషశాస్త్రంలో సైన్స్ డిగ్రీలను అందించాలని నిర్ణయించుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ ఒక రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వ్రాతపూర్వక పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సిన్హా ఈ మెరిట్‌లెస్ పిటిషన్‌ను కోర్టుకు తీసుకు వచ్చినందుకు ఎలాంటి శిక్షా ఖర్చులు విధించలేదు. భార్గవ కూడా సుప్రీం కోర్టులో సంబంధిత మంత్రిత్వ శాఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా సవాలు చేశారు. దీనిని భారత అత్యున్నత న్యాయస్థానం కూడా తోసిపుచ్చింది. పదవులు చేపట్టడానికి ఎప్పుడూ భయపడని, అధికారానికి ఎప్పుడూ తలవంచని, నచ్చని విషయాలను వ్యతిరేకించే వ్యక్తిత్వం ఉన్న పుష్ప మిత్ర భార్గవ ఆగస్టు 1, 2017 న హైదరాబాదులో మరణించారు.

# సీసీ కెమెరాల నిర్వాహణలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన బీఆర్ఎస్ పార్టీ

**గండిపేట్, :సూర్య ప్రతినిధి** రోడ్డు ప్రమాదాల నివారణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా వ్యవహరిస్తాయని భారత రాష్ట్ర సమితి యువజన విభాగం అధ్యక్షుడు సంగం శ్రీకాంత్ తెలిపారు. అలాంటి సీసీ కెమెరాల నిర్వాహణలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల వివరాలను పరిశీలించడం, దొంగతనలను పసిగట్టడం, నేర చరిత్ర కలిగిన వారిని కనిపెట్టడం వంటి కీలక పాత్ర పోషిస్తున్న సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకమైందని పోలీసు వ్యవస్థ ప్రజలతో పాటు మణికొండ మునిసిపల్ అధికారులకు తెలియపరిచారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ చేసే నాథుడు లేక ఎండకు ఎండి వానకు తడిసినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ప్రమాదాలు, నేరాలకు సంబంధించిన వివరాలను సేకరించడంలో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై పర్యవేక్షణ లేకపోవడం పట్ల ఆయన మండిపడ్డారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ నిమిత్తం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అందే లక్ష్మణరావు, కందాడ ప్రవీణ్, తిరుపతి, కిరణ్, బాబురావు, వేణు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మానూన్స్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్లో భాగంగా కాకతీయ హిల్స్ లో పర్యటించిన జీహెచ్ఎంసి కమీషనర్ ఆర్వి కర్ణన్...



**మాదాపూర్ ప్రభాత సూర్య :** ఇండ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిలువకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసి కమీషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. జూలై 29 వ తేదీ నుండి ఆగస్టు 8 వ తేదీ వరకు జీహెచ్ఎంసి ఆధ్వర్యంలో కొనసాగనున్న మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్లో భాగంగా గురువారం జీహెచ్ఎంసి కమీషనర్ ఆర్వి కర్ణన్ మాదాపూర్ లో ని కాకతీయ హిల్స్లో స్థానిక జీహెచ్ఎంసి అధికారులు, శానిటేషన్, ఎంటమాలజీ సిబ్బందితో కలిసి పార్కులను సందర్శించిన అనంతరం కాలనీలో పలు ఇండ్లను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షకాలంలో అనేక రోగ కారకాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. స్థానికులు ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఇండ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మలేరియా, టైఫాయిడ్, ఫ్లూ వంటి రోగాలు వ్యాప్తి చెందకుండా ఆరోగ్యకరమైన అహరపదార్థాలను తీసుకోవాలన్నారు. ఇందులో శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ హేమంత్, డిప్యూటీ కమిషర్ శశిరేఖ, టౌన్లోనింగ్ ఏసిపి నాగిరెడ్డిలతో పాటు శానిటేషన్, ఎంటమాలజి సూపర్వైజర్ శ్రీనివాస్ వర్మ, ఎస్ ఆర్ పి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఎఫ్ ఏ అజహరుద్దీన్ తదితర సిబ్బంది ఉన్నారు.

## మైలార్ దేవ్ పల్లి డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కృషి

కాంగ్రెస్ నాయకులు టి.ప్రేమ్ గౌడ్



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కృషి చేస్తారని కాంగ్రెస్ నాయకులు టి.ప్రేమ్ గౌడ్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వినాయక నగర్ లో శాసన సభ్యులు టి.ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా రోడ్డు పనులు పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తమ దృష్టికి తేవాలని, వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సనా ఉల్లా, లక్ష్మారెడ్డి, అనిల్, ఖలీల్, అంజి గౌడ్, అనిల్, యంజల శేఖర్ నేత, బాలకృష్ణ గౌడ్, శ్రీకాంత్, యాదగిరి, గోపీ, బాబూరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## న్యాయవాది ఎండి. ఇస్మాయిల్ స్ఫూర్తితో న్యాయవాదుల సమస్యల పరిష్కారంకై పోరాడుదాం

ఐలు జిల్లా అధ్యక్షులు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. బొల్లెపల్లి కుమార్




**భువనగిరి, జూలై 31( ప్రభాత సూర్య):**ప్రముఖ న్యాయవాది, ఐలు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి. ఇస్మాయిల్ స్ఫూర్తితో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకై ఐక్యంగా పోరాడుదామని ఐలు జిల్లా అధ్యక్షులు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. బొల్లెపల్లి కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో ఎండి. ఇస్మాయిల్ 2వ వర్ధంతి సందర్భంగా న్యాయవాదులతో కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఎండి ఇస్మాయిల్ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారని, పేదలకు, ప్రజలకు చట్టపరంగా వస్తున్న సమస్యల విషయంలో వృత్తిపరంగా వారికి అండగా ఉంటూ పరిష్కారంలో ముందు బాగాన ఉన్నారని తెలిపారు. నేటికీ న్యాయవాదులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఇప్పటికైనా 2019 ఎన్రోల్మెంట్ అయిన న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, కార్పస్ ఫండ్ ను రూ.500 కోట్లకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ వారు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వి గౌడ్, సీనియర్ న్యాయవాదులు వి. దామోదర్ రెడ్డి, నాగారం అంజయ్య, ఎం.ఏ రహీం, జి. బాబురావు పాల్గొని మాట్లాడగా పి. లింగారెడ్డి, కేశవరెడ్డి, నరసింహ యాదవ్, విద్యాసాగర్, గోద వెంకటేశ్వర్లు, ఎండి. నేహాల్, రేణుక, యం. చంద్రశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ యోగా సంస్థాన్ ప్రకాశలాల్ జీకి నివాళులు

**గండిపేట్, : సూర్య ప్రతినిధి** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కపూర్ నేతాజీ పార్క్ లో జీవించు.. జీవింపజేయు.. అనే నినాదంతో ప్రతి రోజు ఉదయం ఉచిత యోగా సాధన చేయిస్తామని యోగా టీచర్ బి.సుగుణ తెలిపారు. ఒక దీపం లక్షలాది జీవితాలకు వెలుగుని ప్రసాదిస్తూ వారి జీవితాల్లో ప్రకాశాన్ని నింపడమే యోగా సెంటర్ ముఖ్య ఉద్దేశమని హిత బోధ చేసిన సాధకుడు భారతీయ యోగా సంస్థాన్ వ్యవస్థాపకుడు దివంగత ప్రకాశలాల్ జి 16 వ వర్ధంతి నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు సద్గురు ప్రెసిడెంట్ మంజు అగర్వాల్ ముఖ్య అతిథిగా వచ్చి ప్రకాశలాల్ జికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, విజయసింహ, మహాజన్, ఉష తదితర యోగ సాధకలు పాల్గొని ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి రోజు సంస్థ ఆధ్వర్యంలో నిస్వార్థ సేవతో ముందుకు



నడిపించడమే మేము ఆయనకు అర్పించే నిజమైన నివాళిగా భావిస్తున్నామని తెలిపారు. 4 వేల మందికి పైగా సాధాక్స్ తో భారతీయ యోగ సంస్థ ప్రస్తుతం సేవా భావంతో ఉచితంగా యోగ నేర్పబడుతుందని, ఈ సదవకాశాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని యోగ ట్రైనర్ సుగుణ తెలిపారు. యోగా పరిపూర్ణ సాదకుడిగా నేర్చుకొని వారు కూడా సేవా భావంతో సంస్థ ఆశయాలను విజయవంతంగా ముందుకు కొనసాగించాలని ఆమె తెలిపారు. దివంగత ప్రకాష్ లాల్ జీ ఆశయ సాధనకు తోడ్పడిన వారవుతామని తెలిపారు.

## రామ్ రెడ్డి చికెన్ సెంటర్ ప్రారంభం



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేరిలింగంపల్లి డివిజన్, గోపి నగర్ లో బీజేపీ నాయకులు సాయి నూతనంగా ఏర్పాటు చేసిన రామ్ రెడ్డి చికెన్ సెంటర్ షాప్ ను శేరిలింగంపల్లి మాజీ శాసన సభ్యులు భిక్షపతి యాదవ్, బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారబోయిన రవికుమార్ యాదవ్ లింగంపల్లి కంటేస్టేడ్ కార్పొరేటర్ ఎల్లేష్ , ఇతర నాయకులతో కలిసి ప్రారంభించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి వినియోగదారులు, మాంసాహార ప్రియులను అలరించాలని ఆకాంక్షించారు.

## అధికారులకు చిక్కిన చిరుత

ఊపిరి పీల్చుకున్న అధికారులు, ప్రజలు



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** ఎట్టకేలకు చిరుత చిక్కింది.. ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.. వారం రోజులపైగా అధికారులను, నగర శివారు ప్రజలను పరుగులు పెట్టించిన చిరుతను పట్టి బోనులో బంధించారు. వివరాల ప్రకారం.. గత వారం రోజుల నుంచి నగర శివారులో అధికారుల కళ్లు గప్పి తప్పించుకొని తిరుగుతున్న చిరుతను అధికారులు పట్టుకున్నారు. నార్సింగి మున్సిపాలిటీలోని మంచిరేవులలోని ఈకోటిక్ పార్కు బోన్ లో చిరుత చిక్కింది. గత కొద్దిరోజులుగా మృగవాని పార్క్ అండ్ గ్రే హౌండ్స్ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కొద్ది రోజుల క్రితం చిరుతను చూసి అధికారులకు గ్రేహౌండ్స్ గస్తీ పోలీసులు సమాచారం ఇచ్చారు. 8 ట్రాప్ కెమెరాలు, నాలుగు బోన్లను ఏర్పాటు చేసి ఎట్టకేలకు చిరుతను అటవీశాఖ అధికారులు బంధించారు.

# ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ సీఐ రవికుమార్ ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**తుర్కయంజాల్,జూలై 31,ప్రభాత సూర్య:** ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన బి.రవికుమార్‌కు తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. రవికుమార్‌ను కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. నేరాలను అరికట్టడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మాజీ




సర్పంచ్ చెవుల దశరథ, సీనియర్ నాయకులు మేతరి అశోక్,చందు,జగన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో బోనాల పండుగ ఉత్సవాలు

**సంస్థాన్ నారాయణపురం,జూలై 31( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో తెలంగాణ సంప్రదాయ పండుగ బోనాల పండుగను పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థి విద్యార్థినులు బోనాలు ఎత్తుకొని పోతురాజుల వేషాలలో అలరించారు. ఈ సందర్భంగా చైర్మన్ వీణ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతు..తెలంగాణ బోనాల పండుగ యొక్క ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## నూతన ఎక్సైజ్ పాలసీ విధానాన్ని అమలు చేయవద్దు





-చౌటుప్పల్ తహసిల్దార్ మీరాబాయి,సిఐ మన్మధ కుమార్ లకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు

**చౌటుప్పల్.జులై 31.ప్రభాత సూర్య:** నూతన ఎక్సైజ్ పాలసీ విధానంలో గ్రామాలలో మద్యం దుకాణాలను ఏర్పాటుచేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో తాహసీల్దార్ మీరాబాయికి, సీఐ మన్మధ కుమార్ లకు బిజెపి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో 2620 మద్యం దుకాణాలకు టెండర్లలో పోటీ తత్వాన్ని పెంచి సుమారు 1,25,000 టెండర్లను వేయించి 2500 కోట్ల ఆదాయం వచ్చినట్లు చూయించిందన్నారు. నాటి ప్రభుత్వానికి రెట్టింపు మోసంతో నేటి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మద్యాన్ని మూడింతలు చేసే ప్రయత్నంలో ఉన్నదన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పనంగా పెట్టి ఎక్సైజ్ శాఖ ద్వారా ఆదాయ మార్గం ఎంచుకొని ఆ డబ్బులని కొన్ని సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఉపయోగించుకోవాలనే విధానాన్ని బిజెపి పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికే తెలంగాణలో విచ్చలవిడి మద్యంతో ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. నూతన ఎక్సైజ్ పాలసీ విధానంలో గ్రామానికొ మద్యం దుకాణాన్ని విరమించుకోవాలన్నారు. ప్రభుత్వం బలవంతంగా గ్రామీణ ప్రాంతాలలో వైన్స్ లు ఏర్పాటు చేసినట్లయితే బిజెపి ఆధ్వర్యంలో ఎదుర్కొంటామని ప్రభుత్వానికి వినతి పత్రాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూదల బిక్షం గౌడ్,బత్తుల జంగయ్య గౌడ్,ఉబ్బు బిక్షపతి, కట్ట కృష్ణ, వనం ధనుంజయ, సప్పిడి లింగారెడ్డి, వంగాల రమాకాంత్, కడారి ఐలయ్య గుండెబోయిన వేణు, బుడ్డా సురేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో అందరికీ సంక్షేమ పథకాలు

సర్వేల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



**సంస్థాన్ నారాయణపురం, జూలై 31( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల సర్వేల్ గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను సర్వేల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ షబ్బీర్,కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం రోజున పంపిణీ చేయడం జరిగినది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని,రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ నిరంతర ప్రక్రియని పేద ప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మానుపాటి సతీష్ కుమార్,గ్రామశాఖ కోశాధికారి వీరమల్ల పెంటయ్య,గ్రామశాఖ ఉపాధ్యక్షులు సుక్క స్వామి,గ్రామశాఖ కార్యదర్శి రాజేష్ యాదవ్,కార్యదర్శులు బోయ నరసింహ,పగిళ్ల శీను,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుత్త శేఖర్ రెడ్డి,ఎల్లంకి చంద్రయ్య,వెనుముల శంకర్ రెడ్డి,బాజా అంజయ్య,రమేష్,జమాల్,రఘు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకు మహేష్,గోపి, సాయి,పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పంచాయతీ కారోబార్ ఈశ్వర్,గ్రామ ప్రజలు,తదితరులు,పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్లో అడ్మిషన్లు ప్రారంభం

**సంస్థాన్ నారాయణపురం, జూలై 31( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో 6 వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఇంటర్మీడియట్ సీట్ల కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ దీపు జోషి పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆగస్టు 1 నుండి 10 వరకు టిసి, సర్టిఫికేట్ విద్యార్థులు తీసుకొని హాజరుకావాలని కోరారు.మరిన్ని వివరాల కోసం 966658876,9553836108 నెంబర్లకు సంప్రదించవలసిన కోరారు



# తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాటం చేద్దాం

-బీఆర్ఎస్వి మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్

-నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు లింగస్వామి... విద్యార్థి నాయకులు అడేపు సురేష్ కుమార్

**చౌటుప్పల్.జులై 31. ప్రభాత సూర్య:** తెలంగాణకు జలగండంగా మారేలా ఉన్న బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లడం తీవ్రంగా ఖండించదగిన విషయమని బీఆర్ఎస్వి మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్ అన్నారు. గురువారం చౌటుప్పల్ మునిసిపాలిటీ పట్టణ కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ, అరవింద్ జూనియర్ కాలేజ్, నలంద డిగ్రీ కాలేజ్, శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు అడెపు సురేష్ కుమార్, మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు లింగస్వామి, అధ్యక్షులు నడపరాజు రమేష్ లు పాల్గొని విద్యార్థులందరికీ "తెలంగాణ నీటి హక్కుల" పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు ద్వారా గోదావరిలోని తెలంగాణ వాటాను దోచుకోవడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇది సాక్షాత్తూ తెలంగాణ రైతన్నల నోటికాడి ఆహారం లాక్కోవడమే అని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా మారిందని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య పాలన వల్ల గోదావరిలో తెలంగాణ హక్కులు ఖూని అవుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు నోరుమెదపకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాయలసీమకు తరలించే ప్రయత్నాన్ని ఖండిస్తున్నామన్నారు. బనకచర్లను అడ్డుకోవడం ప్రతి తెలంగాణ విద్యార్థి, ప్రతి యువత కర్తవ్యం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యునివర్సిటీ విద్యార్థి నాయకులు అడేపు సురేష్ కుమార్,బిఆర్ఎస్ వి మునుగోడు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు లింగస్వామి, కోశాధికారి ఎండీ ఫారన్,



కార్యదర్శి గుమ్మాల ప్రవీణ్ కుమార్, మున్సిపాలిటీ అధ్యక్షులు మలిగే బాలకృష్ణ, నాయకులు నోముల సుకుమార్ రెడ్డి,గంగాదేవి శివ,ఉదరి రాకేష్ చింటు, సురేష్, గట్టు సుందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి భూమి పూజ




**నల్గొండ జూలై 31 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా కేంద్రంలోని గురువారం ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో 40 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, అందువల్ల విద్యార్థులు బాగా చదువుకోవాలని అన్నారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో రెండు రోజుల్లో తాగునీటి ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ,నెల రోజుల్లో ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో బాత్రూంలు, ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తామని తెలిపారు. కేరళలో 99.9% అక్షరాస్యత ఉండగా, మన రాష్ట్రంలో 60 శాతం ఉందని , విద్య, నైపుణ్యాలు పెంపొందింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు, అన్ని రకాల విద్యా సదుపాయాలు కల్పిస్తున్నదని అన్నారు. నర్సింగ్ విద్యార్థులు చదువు పైన దృష్టి సారించాలని, సెల్ ఫోన్ జోలికి వెళ్ళవద్దని, ప్రజలకు మంచి సేవలు అందించాలని, సమయాన్ని వృధా చేసుకోవద్దని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో 100 కోట్ల రూపాయలతో భవనాలు నిర్మించామని, ఫ్యాకల్టీ, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎల్ఎల్ఎం, ఎం ఫార్మసీ, కోర్సులు,భవనాలు మంజూరు చేశారని 2026-27 సంవత్సరంలో అడ్మిషన్లు సైతం ప్రారంభం కానున్నాయని, లా, ఫార్మసీకి మంచి డిమాండ్ ఉందని అన్నారు. విద్యాభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని అంతేకాక జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నర్సింగ్ కోర్స్ చాలా ఉత్తమమైనదని, వైద్యరంగంలో నర్సింగ్ అనేది మొదటి అడుగు అని అన్నారు. రోగులు ముందుగా స్టాఫ్ నర్స్ ని సంప్రదిస్తారని, డాక్టర్ కన్నా స్టాఫ్ నర్స్ ముఖ్యమని, రోగి ప్రాణాలు కాపాడటంలో స్టాఫ్ నర్స్ పాత్ర ఎంతో ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో మెడికల్ టూరిజం లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అందువల్ల నర్సింగ్ విద్యార్థులు బాగా చదువుకోవాలని ,ప్రస్తుతం నిర్మించనున్న నర్సింగ్ కళాశాల భవనంలో స్టాఫ్ క్వార్టర్స్ ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, సీనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నవారు

## క్రీడాకారులను అభినందించిన రవియాదవ్..




**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :**ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్పూర్‌లో జరిగిన 5 వ జాతీయ సబ్-జూనియర్ అండ్ క్యాడెట్ గ్రాప్లింగ్ (రెస్లింగ్) ఛాంపియన్‌షిప్ 2025 లో భాగంగా పాల్గొన్న తెలంగాణ టీమ్ గురువారం రోజు చర్లపల్లి రైల్వే స్టేషన్ చెరుకున్న. టీమ్ సభ్యులు, కోచ్ మరియు సహాయక సిబ్బందికి శేరిలింగంపల్లి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మార బోయిన రవియాదవ్ ఘనంగా స్వాగతం పలికారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పోటీల్లో తెలంగాణ టీమ్ అన్ని మెడళ్లు సాధించిన టీమ్ సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి గౌరవించారు. తెలంగాణ యువ క్రీడాకారుల ఈ విజయం మనందరికీ గర్వప్రదం. మీ అవిరామ కృషి మరిన్ని విజయాలను సాధించాలని కోరుకుంటున్నానని తెలిపారు.

# మొక్కలను పెంచుదాం... ఆరోగ్యంగా జీవిద్దాం

-చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి

**చౌటుప్పల్.జులై 31.ప్రభాత సూర్య:**ఓ ఖాళీ స్థలాలలో, ఇంటి ఆవరణలో మొక్కలను నాటి వాటి ద్వారా ప్రకృతిని ఆస్వాదిస్తూ ఆనందంగా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందాలని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ వెంకట్రాంరెడ్డి అన్నారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా 60వ రోజు వన మహోత్సవ కార్యక్రమంను 6వ వార్డులోని ముత్యాలమ్మ గుడి దగ్గర మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ రెడ్డి వార్డు ప్రజలకు మొక్కలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. వన మహోత్సవంలో భాగంగా ఆయన ముత్యాలమ్మ గుడి ఆవరణలో ఒక పూల మొక్కను నాటుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలను తమ తమ ఇండ్లలో పెట్టుకోవాలని , పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనాన్ని పెంచుతూ ప్రకృతిని ఆస్వాదించి ఆనందాన్ని పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మేనేజర్



అంజయ్య , ఎస్సై హనుమాన్ ప్రసాద్,ఈఈ రేణుకుమార్, వార్డ్ ఆఫీసర్లు,రాజేందర్, రాణి, కిరణ్, రాజు, బిల్ కలెక్టర్ అంజయ్య, జవాన్లు నరసింహ, ఆర్ పి నర్మద, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కరాటే విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుంది






-విద్యార్థులు విద్యపై ఆసక్తి పెంచుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలి...

-కరాటేతో వేధింపులను ఎదుర్కొనే ధైర్యం వస్తుంది...

-ప్రతిభ ఒకేషనల్, శ్రీ మేధ జూనియర్ కళాశాలలో కరాటే శిక్షణ ప్రారంభం..

-సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయ్ భార్గవ్

-కళాశాల కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి, ప్రిన్సిపల్ సిలివేరు శ్రీనివాస్

**చౌటుప్పల్.జులై 31. ప్రభాత సూర్య:** కరాటే శిక్షణతో బాలికలకు ఆత్మరక్షణ, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందుతుందని చౌటుప్పల్ ఎస్సై విజయ్ భార్గవ్ అన్నారు. చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని గాంధీ పార్క్ వద్ద గల ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాల, శ్రీ మేధా జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత కుంకు కరాటే శిక్షణ కార్యక్రమాన్ని శిక్షకుడు బొడ్డు పరమేష్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై విజయ భార్గవ్ పాల్గొని వారి చేతులు సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో అమ్మాయిలపై జరుగుతున్న దాడుల దృష్ట్యా బాలికల ఆత్మరక్షణ కోసం కుంగ్ ఫూ,కరాటే చాలా అవసరమని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయ్ భార్గవ్ అన్నారు. విద్యార్దులు చరవాణిలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్ లలో తమ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో షేర్ చేసుకోవద్దని సూచించారు. విధ్యార్దులు విధ్యపై ఆసక్తి పెంచుకొని లక్ష్యసాధనకై కృషి ఛేయాలని సూచించారు. కరాటే నేర్చుకోవడం వల్ల బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. విద్యార్థుల ఆత్మరక్షణ కోసం ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కళాశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా ఆయన అభినందించారు. బాలికల కరాటే విన్యాసాల ప్రదర్శనను ఆయన వీక్షించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహనను కూడా పెంచుకోవాలన్నారు. -కరాటేతో వేధింపులను ఎదుర్కొనే ధైర్యం వస్తుంది: కళాశాల కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి కళాశాలలో ప్రారంభించిన కరాటే శిక్షణ ప్రారంభ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి మాట్లాడుతూ.. బాలికలకు వేధింపులు ఎదురైనప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఆత్మ రక్షణ కొరకు కరాటే ఉపయోగపడుతుందన్నారు. శారీరక బలం,ఓర్పు, చురుకుదనం పెరుగుతాయన్నారు. కరాటే శిక్షణ మానసిక బలాన్ని కూడా పెంచుతుందన్నారు. ముఖ్యంగా బాలికలు తమను తాము రక్షించుకోవడానికి, సురక్షితంగా ఉండటానికి కరాటే ఒక ముఖ్యమైన సాధనం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి ,ప్రిన్సిపాల్ సిలివేరు శ్రీనివాస్, లింగస్వామి,రాజు, నిరంజన్, బాలక్రిష్ణ , రాజేష్, జ్యోతి,రజిత, నవ్య ,జ్యోతి,భాగ్యలక్ష్మి , రాణి ,విధ్యార్దినీ విధ్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ పాదయాత్ర సన్నాహక సమావేశం, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్ ల పంపిణీ..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** పరిగి నియోజకవర్గం నుండి ప్రారంభమయ్యే "తెలంగాణలో నూతన మేల్కొలుపు - కాంగ్రెస్ పాదయాత్ర" ప్రారంభానికి సంబంధించి టీ పి సి సి రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టి పి సి సి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో జరిగే కీలక సన్నాహక సమావేశంలో చురుగ్గా పాల్గొనేందుకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్. ఈ సందర్భంగా, జగదీశ్వర్ గౌడ్ అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో కూడా పాల్గొని, ప్రజాసేవ సంక్షేమం పట్ల నాయకుల నిబద్ధతను పునరుద్ఘాటించారు. జరగబోయే యాత్రలో చురుగ్గా పాల్గొనడానికి ప్రతి అడుగులో ప్రజలతో నిలబడటానికి. సామాజిక న్యాయం కోసం ఒక పాదయాత్ర. మార్పు కోసం ఒక అడుగు. ప్రజల కోసం ఒక స్వరం ను వినిపిస్తాం అని మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ యలమంచి ఉదయ్ కిరణ్ ఈ సందర్భంగా తెలిపారు.




## లక్కారం ఆదర్శ పాఠశాల, కళాశాలలో సీట్లకు స్పాట్ అడ్మిషన్స్

-ఆదర్శ పాఠశాల,కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి




**చౌటుప్పల్.జులై 31.ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పురపాలక కేంద్రం, లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2025-26 సంవత్సరానికి గాను 8వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీలు ఉన్నట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి తెలిపారు. 8 తరగతిలో 6 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 6 సీట్లు, బైపీసీ గ్రూపులో 6 సీట్లు, సిఇసి గ్రూపులో 10 సీట్లు ఖాళీలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎనిమిదో తరగతిలో చేరటానికి ఏడవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చదవడానికి పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆగస్టు 4 వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినీ విద్యార్థులు చౌటుప్పల్ లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల,కళాశాలకు వచ్చి నేరుగా దరఖాస్తు చేసుకోవాలని గురువారం పత్రికకి ఇచ్చిన ప్రకటన ద్వారా ప్రిన్సిపాల్ సరస్వతి తెలియజేశారు.

## కాటమయ్య కాలనీలో పారిశుద్ధ్య పనులు..

-పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

-చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి




**చౌటుప్పల్. జులై 31. ప్రభాత సూర్య:** ప్రతి ఒక్కరు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా జీవించాలని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి అన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి పారిశుధ్య కార్మికులతో గురువారం 60వ రోజు ప్రత్యేక పారిశుద్ధ్య పనులను 14వ వార్డు కాటమయ్య కాలనీ పార్క్, కాటమయ్య గుడి పరిసర ప్రాంతాల్లో రోడ్ల వెంబడి పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు, డ్రైనేజీలను శుభ్రం చేయించారు. పారిశుద్ధ కార్మికులు బాగా పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సిబ్బందికి అన్ని విధాల తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హనుమాన్ ప్రసాద్,ఈ ఈ రేణుకుమార్,జవాన్లు , నరసింహ,అంజయ్య పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా షేక్ బాజీ బాబా



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా షేక్ బాజీ బాబాను రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షకీల్ నియమించారు. హైదరాబాదులోని రాష్ట్ర కార్యాలయంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా షేక్ బాజీ బాబాకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ షకీల్ మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా పనిచేసిన బాజీ బాబాను ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని యువకుడిగా ఉత్సాహవంతుడిగా ప్రస్తుత రాజకీయాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న బాజీ బాబా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీలో చేరటం మరియు కీలక బాధ్యతలు తీసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో ముస్లిం లీగ్ పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని అదేవిధంగా బడుగు బలహీన వర్గాలకు అండగా నిరంతరం వారి పక్షాన ఉండి పోరాటాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా షేక్ బాజీ బాబా మాట్లాడుతూ తనను జిల్లా అధ్యక్షుడుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ షకిల్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఐయుయంల్ పార్టీ అభివృద్ధి కోసం తన వంతుగా జిల్లాల కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.

## జూలకంటి రంగారెడ్డికి వినతిపత్రం అందజేత



**చౌటుప్పల్.జులై 31. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండల కేంద్రంలోని ప్రైవేటు జూనియర్,డిగ్రీ,పీజీ కళాశాల యాజమాన్యులు గురువారం సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్ వెళుతుండగా మార్గమధ్యంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం వారికి వినతిపత్రం అందజేశారు. గత నాలుగు సంవత్సరాల నుండి స్కాలర్షిప్లు రాక కళాశాలల యాజమాన్యం ఇబ్బందులు పడుతున్నామని వారికి తెలియజేశారు. కనీసం కరెంటు బిల్లులు కూడా కట్టలేని పరిస్థితిలో ఉన్నామని, అధ్యాపకులకు జీతాలు, కాలేజీ బిల్డింగ్ లకు అద్దెలను చెల్లించడానికి చాలా ఇబ్బంది పడుతున్నామని వారికి వినతిపత్రం అందజేసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి సిపిఎం పార్టీ తరఫున తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యాలు బత్తుల శంకర్, గంగాపురం జంగయ్య, వల్ల మల్ల రాజశేఖర్, సిలివేరు శ్రీనివాస్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్ తదితరులున్నారు.

# గొర్రెల పంపిణీ స్కాం..ఈడి దూకుడు

**హైదరాబాద్ :** గొర్రెల పంపిణీ కేసులో ఈడీ విచారణ కొనసాగుతోంది. ఏసీబీ కేసు ఆధారంగా ఈసీఐఆర్ నమోదు చేసి రంగంలోకి దిగింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ 10 చోట్ల సోదాలు నిర్వహించింది ఈడీ. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, జూబ్లీహిల్స్, అత్తాపూర్‌తో పాటు పలు చోట్ల సోదాలు చేసింది. పశుసంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామచందర్ నాయక్, కాంట్రాక్టర్ ఖాజా మొయి నొద్దీన్, మాజీ ఓఎస్డీ కల్యాణ్ ఇంట్లో ఈడీ సోదాలు జరిపింది. లోలోన కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయాల్లో కూడా ఈడీ సోదాలు జరిపింది. ఈక్రమంలో మాజీ ఓఎస్డీ కల్యాణ్‌ను అదుపులోకి తీసుకున్న ఈడీ.. కొన్ని గంటల పాటు విచారించారు. అంతకుముందు దిల్‌సుఖ్‌నగర్‌లోని కల్యాణ్ ఇంట్లో ఈడీ సోదాలు చేసింది. కల్యాణ్ ఇంట్లో భారీగా నోట్ల కట్టలు స్వాధీనం చేసుకుంది. దిల్‌సుఖ్ నగర్‌లో ఐదుప్లాట్లు, ఒః నగర్‌లో బినామీల పేర్లతో ఇండిపెండెంట్ ఇళ్లు కొనుగోలు చేసినట్లు గుర్తించింది. మనీలాండరింగ్ జరిగినట్టు గుర్తించింది. గొర్రెల పంపిణీలో ప్రైవేట్ వ్యక్తులతో లాలూచీ పడ్డట్లు నిర్ధారించింది. రైతులకు చెల్లించాల్సిన రూ.2.10 కోట్లు.. అప్పటి సీఈవో రాంచందర్‌తో కలిసి కల్యాణ్ పంచుకున్నట్లు తెలుస్తోంది.మరోవైపు ఈకేసులో కీలక నిందితుడిగా ఉన్న మొయినుద్దీన్ విదేశాల్లో ఉన్నారు. ఈకేసులో ఏ1గా ఉన్న మొయినుద్దీన్ భార్య ఖాతాలోకి భారీగా నగదు మళ్లించినట్లు గుర్తించారు ఈడీ అధికారులు. మొయనుద్దీన్ భార్య ఉంటున్న మూవీ టవర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఓవరాల్‌గా గొర్రెల పంపిణీ కేసులో.. రూ. 700 కోట్ల అవినీతి జరిగిందంటూ ఏసీబీ కేసు నమోదు చేశారు. గతంలోనే ఏసీబీ పలువురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించింది. ఈ కేసులో పశుసంవర్ధక శాఖ మాజీ ఎండీ రాంచందర్‌నాయక్, మాజీ ఓఎస్డీ కల్యాణ్ సహా మొత్తం 17మందిని ఏసీబీ గతంలోనే అరెస్ట్ చేసింది. కల్యాణ్ సహా కొందరు బెయిల్‌పై బయటకు వచ్చారు.గొర్రె పిల్లల కొనుగోలు కోసం కొండాపూర్‌లోని 'లోలోనా ది లైవ్ కంపెనీ'కి గత బీఆర్ఎస్? ప్రభుత్వం కాంట్రాక్ట్ ఇచ్చింది. ఆ సంస్థకు చెందిన సయ్యద్ ఖాజా మొయినొద్దీన్‌తో పాటు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవికుమార్, కేశవసాయి ఏపీలో 18 మంది రైతుల దగ్గర 133 యూనిట్ల గొర్రెలను కొనుగోలు చేశారు. వీటికి సంబంధించిన 2కోట్ల 10 లక్షలు తమ బినామీల అకౌంట్స్‌లో డిపాజిట్ చేసుకున్నారు. తమకు రావాల్సిన డబ్బును ఏపీలోని వివిధ జిల్లాలకు చెందిన ఇతరుల అకౌంట్స్‌లో డిపాజిట్ అయినట్లు గుర్తించారు. 2023 డిసెంబర్‌లో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును కాంగ్రెస్ సర్కార్.. ఏసీబీకి బదిలీ చేసింది. అదే సమయంలో ఖాజా మొయినొద్దీన్, ఆయన కొడుకు దుబాయ్‌కి పారిపోయారు. ఈ కేసుపై ఈడీ ఫోకస్ నగదు లావాదేవీలు, అధికారుల పాత్రపై దర్యాప్తు చేస్తుంది. ఈ కేసులో ఈడీ ఎటువంటి చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కృతిమ చెయ్యి అమరిక

**కమాన్ పూర్ :** లైన్స్ క్లబ్ సెంటినరీ కాలనీ వారి ఆధ్వర్యంలో ఉచితంగా కృత్రిమ చెయ్యి అమరించారు. మంథని కి చెందిన సయ్యద్ హుస్సేన్ కు సహాయం చేసిన లయన్స్ డాక్టర్ శరణ్య యాదవ్ మరియు క్లబ్ – సయ్యద్ హుస్సేన్ ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో మంథనికి చెందిన సయ్యద్ హుస్సేన్ కు కృతిమ చెయ్యి ను అమర్చడం జరిగింది. అనంతరం క్లబ్ డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ సయ్యద్ హుస్సేన్ కు ప్రమాదవశాత్తు జరిగిన యాక్సిడెంట్లో తన కుడి చేతిని తొలగించడం జరిగింది.లయన్స్ క్లబ్ ద్వారా కృతిమ చెయ్యి ను అమరుస్తారని విషయం తెలుసుకొని తమ మిత్రుడు గుండం సురేష్ ద్వారా మా లయన్స్ క్లబ్ డైరెక్టర్ డాక్టర్ శరణ్య యాదవ్ దృష్టికి తీసుకురాగా వెంటనే లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని చెందిన పాస్ట్ జెడ్ సి రాజేందర్ ని సంప్రదించి సయ్యద్ హుస్సేన్ వివరాలు, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితినీ వివరించి సహాయం చేయాలని కోరగా వారు వెంటనే సానుకూలంగా స్పందించి నెల క్రితం చేతి కొలతలు తీసుకొని తయారుచేసి ఈరోజు ఉచితంగా కృతిమ చెయ్యి ను అమర్చడం జరిగిందనీ తెలిపారు.దీనిలో ముఖ్య పాత్ర పోషించిన లయన్స్ పాస్ట్ జెడ్ సి రాజేందర్ , డాక్టర్ శరణ్య యాదవ్ కు ధన్యవాదములు తెలుపుతూ లయన్స్ క్లబ్ ఎప్పుడు పెద ప్రజలకు సహాయం చేయడానికి ముందుంటుందని తెలిపారు.ఇంకా ఎవరైనా కృతిమ కాలు, చెయ్యి అవసరం ఉన్న వారు మమ్ములను సంప్రదించాలని తెలిపారు. సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ నా యొక్క పరిస్థితి అర్థం చేసుకొని నాకు ఉచితంగా కృతిమ చెయ్యి అమర్చడానికి సహాయం చేసిన డాక్టర్ శరణ్య యాదవ్ కి,రాజేందర్ కి మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి మరియు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వైద్య నిపుణురాలు లయన్స్ డాక్టర్ శరణ్య యాదవ్, లయన్స్ మేకల మారుతి యాదవ్,గుండం సురేష్,బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# అజంనగర్‌లో ఆకస్మికంగా పర్యటించిన కలెక్టర్

**జయశంకర్ భూపాలపల్లి :** విద్యార్థులకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ గ్రామం లో ఆకస్మికంగా పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిం చారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆసుపత్రికి వచ్చే రోజుల సంఖ్యతో పాటు, ఆసుపత్రి పరిసరాలు, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే సమావేశం నిర్వహించి ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రి లో సరిపడా మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా లాంటి ప్రాణాంతకమైన వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. జ్వరం ప్రబలిన ప్రాంతాలల్లో వైద్య క్యాంపు లు నిర్వహిస్తూ వ్యాధుల ను అరికట్టాలని తెలిపారు. ప్రబలిన వ్యాధులపై అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ముఖ్యంగా వివిధ గ్రామాలలోని పాఠశాలలు, గురుకుల పాఠశాలలో విద్యార్థులను పరీక్షించి ప్రతి విద్యార్థి ఆధార్ కార్డు నెంబర్ ఆధారంగా విద్యార్థి యొక్క హెల్త్ ప్రొఫైల్ ను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలను సంర్శించి పాఠశాల ఆవరణ మొత్తం పరిశీలించారు. పాఠశాలలో బోధనా విధానాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఆవరణలోనే అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రానికి విద్యుత్ సదుపాయం లేదని వారు తెలుపగా వెంటనే జిల్లా విద్యుత్ శాఖ అధికారి కి ఫోన్ చేసి అంగన్వాడి కేంద్రానికి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న గాజుల స్వాతికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల ను పరిశీలించి త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, డా. ప్రమోద్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎం.పి.ఓ నాగరాజు ప్రధానోపాధ్యాయులు మంజుల, రాజు,పంచాయతీ సెక్రెటరీ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



## శేష జీవితం పిల్ల పాపలతో సంతోషంగా ఉండాలి

**కమాన్ పూర్ :** శేష జీవితం పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలి అని సింగరేణి వివిధ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. గురువారం ఆర్ జి త్రీ పరిధిలోని ఓసిపి1లోఆపరేటర్ గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఐఎన్టియుసి నాయకుడు వెంకటస్వామికి గనిలో ఘన వీడ్కోలు సన్మానం నిర్వహించారు.సింగరేణి ఆర్జి3 ఓసీ1 గనిలో సుదీర్ఘకాలం ఈపి ఆపరేటర్ గా పనిచేస్తూ 61వ సంవత్సరాలు పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొందుతున్న ఐఎన్టీయూసీ గని పిట్ కార్యదర్శిగా కొనసాగుతున్న గునిగంటి వెంకటస్వామి దంపతులను ఐఎన్టియుసి, వివిధ కార్మిక యూనియన్ నాయకులు, తోటి ఉద్యోగులు, అధికారులు, తనతో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, తన గ్రామ ప్రముఖులు ఘనంగా సన్మానించి, ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు ఆయనను సన్మానించి జ్ఞాపికలు, పూల బొకేలు, పూలదండలతో స్వీట్ అందజేసి శాలువాలు, టవాలులు కప్పి ఘనంగా సన్మాన సభ నిర్వహించారు. ఓసీ1 సైట్ ఆఫీస్ నందు యాజమాన్యం ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో గని ప్రాజెక్ట్ అధికారి జంగిటి రాజశేఖర్, ఇన్చార్జి మేనేజర్ బైరి రమేష్, అధికారుల సంఘం ప్రతినిధి మధు, ఐఎన్టియుసి నాయకులు కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్, ఆర్జి3 ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, నాయకులు జక్కుల దామోదర్, కొలిపాక సారయ్య, యం.ప్రభాకర్ రెడ్డి, శైలజ, కిషన్ నాయక్, మోతుకూరి సాంబయ్య, తోకల ప్రవీణ్ రెడ్డి, సతీష్, రాజన్న, రంగు దిలీప్, రఘు, తిరుమలేష్, ఆనంద్, జక్కుల చంద్రయ్య, రవికుమార్, జంజర్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎమ్.ఎస్.ఓ జయశ్రీ

వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం




**సంస్థాన్ నారాయణపురం, జూలై 31( ప్రభాత సూర్య):** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పర్యవేక్షించేందుకు ఎంఎస్ఓ మేడమ్ యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యత, పురోగతిపై లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల తాజా స్థితిగతులు, ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమోద్, పంచాయతీ కార్యదర్శిలు శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## చౌటుప్పల్ లో అక్రమ మద్యం పట్టివేత

–బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

–చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్




**చౌటుప్పల్.జులై 31. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండలంలోని డి నాగారం, లక్కారం గ్రామ పరిధిలలో నిలువ ఉంచిన అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. సిఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల మేరకు.. గురువారం సిఐ ఆదేశాల మేరకు చౌటుప్పల్ మండల కేంద్రం డి నాగరం గ్రామ పరిధిలో కోయగుర వెంకటేష్ ఇంటిని తనిఖీ చేయగా, ఐబీ 180 ఎం.ఎల్ 09 బాటిల్స్, ఓసి 180 ఎం ఎల్ 7 బాటిల్స్, కేఎఫ్ లైట్ బీర్లు3 గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.అలాగే లక్కారం గ్రామ పరిధిలో ఓ మహిళ నిర్వహిస్తున్న జనరల్ స్టోర్ నందు తనిఖీ నిర్వహించగా ఐబి 180 ఎం ఎల్ 02 బాటిల్, దక్కన్ బ్లూ 180 ఎంఎల్ 06 బాటిల్స్ గుర్తించడం జరిగిందన్నారు. వెంటనే ఆట్టి మద్యం బాటిల్స్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి ఇరువురిపై అక్రమమద్యం కేసులను నమోదు చేయడం జరిగిందన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ మన్మథ కుమార్ హెచ్చరించారు.


## ౦౦13 ఏళ్ల బాలికతో 40 ఏళ్ల వ్యక్తికి పెళ్లి మ్యారేజీని ఆపిన అధికారులు

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా నందిగామలో దారుణం చోటు చేసుకుంది. పేదరికం కారణంగా 13 ఏళ్ల బాలికకు ఆమె తల్లి 40 ఏళ్ల వ్యక్తికి ఇచ్చి బలవంతంగా పెళ్లి చేసింది. అయితే చదువుకోవాలనే ఆశతో ఆ బాలిక ధైర్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆశ్రయించింది. పోలీసులు వెంటనే స్పందించి బాలిక తల్లి, వరుడు, మధ్యవర్తి, పూజారిపై బాల్య వివాహాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ప్రస్తుతం బాలికను రెస్క్యూ హోమ్‌కు తరలించారు.ఆటపాటలతో, అల్లరితో గడిచిపోవాల్సిన వయసు. పుస్తకాల ప్రపంచంలో విహరిస్తూ.. ఉజ్వల భవిష్యత్తు కోసం కలలు కనాల్సిన సమయం. కానీ పేదరికం ఆ పసి జీవితాన్ని నరక కూపంలోకి నెట్టేసింది. ఒక తల్లి తన పేదరికాన్ని గెలిపించుకోవాలని.. 13 ఏళ్ల కూతురి కలను చెరిపేసి 40 ఏళ్ల వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేసింది. అయితే చదువుకోవాలన్న బలమైన ఆకాంక్షే ఆ బాలికకు ధైర్యం ఇచ్చి తన జీవితాన్ని తనే మార్చుకునేలా చేసింది. తన జీవితంపై పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నించిన వారందరినీ ఎదిరించి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆశ్రయించింది. తల్లి బలవంతాన్ని, సమాజ కట్టుబాట్లను ధైర్యంగా ఎదిరించి తన చదువుకై పోరాటం చేసి నరకం నుంచి బయటపడింది.వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా నందిగామకు చెందిన ఒక మహిళకు భర్త చనిపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ తన ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా.. ఆమె తన 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల కుమార్తెకు పెళ్లి చేయాలని నిశ్చయించుకుంది. ఈ క్రమంలో ఓ మధ్యవర్తి సాయంతో 40 ఏళ్ల వ్యక్తికి ఆస్తి ఉందని చెప్పి బాలికతో పెళ్లిని కుదిర్చారు. మే 28న బాలిక ఇష్టానికి వ్యతిరేకంగా ఓ దేవాలయంలో బలవంతంగా బాల్య వివాహం జరిపించారు.అయితే తనకు పెళ్లి ఇష్టం లేదని, చదువుకోవాలని ఉందని ఆ బాలిక తన మనసులో బాధను స్నేహితులకు చెప్పుకుంది. ధైర్యం చేసి తన పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆశ్రయించి మొత్తం విషయాన్ని వివరించింది. బాలిక ఆవేదనను విన్న ప్రధానోపాధ్యాయుడు వెంటనే ఆమెను నందిగామ తహసీల్దార్ వద్దకు తీసుకెళ్లారు. తహసీల్దార్ సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక ఫిర్యాదు ఆధారంగా.. పోలీసులు ఆమె తల్లి, బాలికను పెళ్లి చేసుకున్న చేవెళ్ల మండలం కందవాడకు చెందిన శ్రీనివాస్ గౌడ్, పెళ్లి కుదిర్చిన మధ్యవర్తి, వివాహం జరిపిన పూజారిపై బాల్య వివాహాల నియంత్రణ చట్టం 2006 కింద కేసు నమోదు చేశారు. అనంతరం బాలికను రక్షించి రెస్క్యూ హోమ్‌కు తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాలికను పెళ్లి చేసుకున్న శ్రీనివాస్ గౌడ్‌పై స్థానికులు మండిపడుతున్నారు. కూతురి వయస్సున్న అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకున్నాడని ఫైరవుతున్నాయి. అతడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

## సమతా మూర్తి మూడో వార్షికోత్సవం ప్రధానిని రావాలని ఆహ్వానం

**హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని త్రిదండి చిన్నజీయర్ స్వామి, మైహోమ్ గ్రూప్ చైర్మన్ డా.జూపల్లి రామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ రామురావు మర్యాదపూర్వకంగా కలిశారు. ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం 3 వార్షికోత్సవాల సందర్భంగా ఈ ఏడాది చివరలో నిర్వహించే ముగింపు వేడుకలకు విశిష్ట అతిథిగా రావాలని ఆహ్వానించారు.శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, మైహోమ్ గ్రూప్ చైర్మన్ డా.జూపల్లి రామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ రామురావు ఇటీవల ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు.ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం 3 వార్షికోత్సవాల సందర్భంగా ఈ ఏడాది చివరలో నిర్వహించే ముగింపు వేడుకలకు విశిష్ఠ అతిథిగా రావాలని ప్రధానమంత్రిని ఆహ్వానించారు. ఇందుకు ప్రధానమంత్రి మోదీ సానుకూలంగా స్పందించారు.ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ ఉదయం డాక్టర్ రామేశ్వరరావ్, రామురావుతో కలిసి ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసిన చినజీయర్ స్వామి... హైదరాబాద్ ముచ్చింతల్‌లోని సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం విశేషాలను వివరించారు.సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం ప్రాంగణంలో ఉన్న 108 దివ్య దేశాలలో కొలువుతీరిన దేవతామూర్తులకు జరిగే నిత్య కైంకర్యాలను ప్రధానికి తెలియజేశారు. 45 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో జీయర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తోన్న నేత్ర విద్యాల యం, ఆయుర్వేద- హోమియో కళాశాల పురోగతి గురించి ప్రధాని ఆసక్తిగా తెలుసుకు న్నారు.





# ‘సైయారా’ సంచలనం..
# 13 రోజుల్లో ‘ఛావా’ రికార్డు బద్దలు!

బాలీవుడ్‌తో పాటు ప్రస్తుతం ఇండియా అంతటా వినిపిస్తున్న పేరు సైయారా  చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం ఇండియాతో పాటు వరల్డ్ వైడ్‌గా సంచలనాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ చిత్రం రూ. 400 కోట్ల వసూళ్లను రాబట్టి విజయవంతంగా దూసుకెళుతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం మరో రికార్డును అందుకుంది. ఓవర్సీస్‌లో ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సొంతం చేసుకున్న బాలీవుడ్ సినిమాగా రికార్డు నెలకొల్పిన ‘ఛావా’ సినిమా రికార్డును బీట్ చేసింది సైయారా. ఛావా సినిమా వరల్డ్ వైడ్‌గా రూ.91 కోట్లు వసూళ్లను రాబట్టి.. ఈ ఏడాది టాప్‌లో ఉండగా.. కేవలం 13 రోజుల్లోనే ఈ రికార్డును అధిగమించి రూ.94 కోట్లతో దూసుకుపోతుంది సైయారా. ఈ చిత్రానికి మోహిత్ సూరి దర్శకత్వం వహించగా.. ఆహాన్ పాండే, అనిత్ పడ్డా హీరో హీరోయిన్‌లుగా నటించారు.



# మీ అందరి ప్రేమ వల్లే ఈ విజయం
## కింగ్‌డమ్ సక్సెస్ మీట్‌లో విజయ్ దేవరకొండ


కింగ్‌డమ్ మూవీ నేడు థియేటర్స్ లో విడుదలై మంచి టాక్ సొంతం చేసుకుంది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన కింగ్‌డమ్ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండతో పాటు భాగ్యశ్రీ బోర్సే, సత్యదేవ్ మలయాళ నటుడు వెంకటేష్ నటించారు. శ్రీకర స్టూడియో సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు. జులై 31న గ్రాండ్ గా విడుదలైన ఈ సినిమాకు అన్ని ఏరియాల నుంచి పాజిటివ్ టాక్స్ వస్తున్నాయి. ఇప్పటికే సినిమా బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకోవడంతో చిత్రయూనిట్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రేక్షకుల దగ్గర నుంచి సినీసెలబ్రెటీలు కూడా ఈ సినిమా పై ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ రావడంతో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ ను ఏర్పాటు చేశారు. విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ మూవీ కింగ్ డమ్. ఈ సినిమా  జులై 31 న ప్రేక్షకుల ముందుకు వచ్చింది.  ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులంతా ఎంతగానో ఎదురుచూసిన చిత్రం ఇది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే, సత్యదేవ్, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. మొదటి షో నుంచి కింగ్ డమ్ పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమా బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది.



# అరె ఎప్పుడురా !
# రచ్చ మూవీలో నటించిన ఈ పాప..
# ఇప్పుడు హీరోయిన్

టాలీవుడ్‌లో బాల నటీనటులుగా ఫిల్మ్ జర్నీ ప్రారంభించి.. తర్వాత హీరోలుగా, హీరోయిన్లుగా ఎదుగుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. తేజ సజ్జా, కావ్య కల్యాణ్ రామ్ వంటి వాళ్లు ఈ మార్పుకు బెస్ట్ ఎగ్జాంపుల్స్. ఇప్పుడు అదే లిస్ట్‌లోకి చేరింది మరో పేరు విశికా కోటా. విశికా 2012లో వచ్చిన రామ్ చరణ్ నటించిన ‘రచ్చ’ సినిమాలో బాల నటిగా నటించింది. ఈ సినిమాలో తాను చేసిన క్యారెక్టర్ ఎవరిదో తెలుసా? తమన్నా చిన్ననాటి పాత్ర! ఆ పాత్రలో అందర్నీ ఆకట్టుకున్న విశికా, ఇప్పుడు ఫుల్ లెంగ్త్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లో అడుగులు వేస్తోంది. ఇప్పటికే ‘ఏందిరా ఈ పంచాయితీ’, ‘సగిలేటి కథ’ వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించిన విశికా, మరోవైపు కీలక పాత్రలతో కూడా తెరపై కనిపిస్తోంది. చిన్నతనంలో సినిమాల్లో నటించిన అనుభవం ఆమెకు ఇప్పుడు ఓ బలంగా మారింది. సన్ని డియోల్ నటించిన జాట్ అనే హిందీ సినిమాలోనూ మంచి పాత్ర పోషించింది. ఓదెల 2లోనూ విశికా కనిపించింది. ఓ ఇంటర్వ్యూలో విశికా మాట్లాడుతూ..“రచ్చ సినిమా టైమ్‌కి నేను చరణ్‌ను గానీ, తమన్నాను గానీ కలవలేను. వాళ్లు నా సీన్స్ షూట్ చేసే సమయంలో సెట్లో లేరు. అందుకే ఇప్పుడు వాళ్లు నన్ను చూస్తే.. గుర్తుపట్టే ఛాన్స్ కూడా ఉండదు” అని చెప్పారు. 1998 జూలై 19న హైదరాబాద్‌లో జన్మించిన విశికా, చదువు పూర్తి చేసిన తర్వాత నటన పట్ల ఆసక్తి పెరిగి ఫుల్‌టైమ్‌గా సినిమాల్లోకి వచ్చిందట. కేవలం గ్లామర్ పాత్రలకే కాకుండా, నటనకు స్కోప్ ఉన్న రోల్స్‌కి మొదటి ప్రాధాన్యం ఇస్తోంది. అయితే స్క్రీన్‌పై ఎంత బాగా కనిపించినా%ొ% సోషల్ మీడియా మీద మాత్రం మరింత స్టైలిష్‌గా, హాట్‌గా కనిపిస్తోంది ఈ బ్యూటీ. తరచూ గ్లామర్ ఫొటోషూట్లు పోస్ట్ చేస్తూ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను పెంచుకుంటోంది. ఈ తెలుగు అమ్మాయికి టాలెంట్ ఉన్నదని, మంచి అవకాశాలు రావాలని నెటిజన్లు కామెంట్స్‌తో సపోర్ట్ చేస్తున్నారు.



# మయసభ ట్రైలర్.. స్నేహితులు, రాజకీయ ప్రత్యర్థులుగా మారితే..

ప్రేక్షకులకు విభిన్నమైన కంటెంట్‌ను అందించడంలో ముందున్న ఓటీటీ ప్లాట్‌ఫామ్ సోనీ లివ్. ఇప్పుడు రాజకీయ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ ‘మయ సభ’ ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. “రైజ్ ఆఫ్ ది టైటాన్స్” అనేది ఈ సిరీస్ ట్యాగ్ లైన్. సీనియర్ దర్శకుడు దేవా కట్టా దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ ఆగస్టు 7 నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ వెబ్ సిరీస్‌కి నిర్మాతలుగా విజయ్ కృష్ణ లింగమనేని, శ్రీహర్ష వ్యవహరించగా, హిట్ మ్యాన్ – ఫ్రూడోస్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై తెరకెక్కింది. ముఖ్య పాత్రల్లో ఆది పినిశెట్టి, చైతన్య రావు, దివ్య దత్తా, సాయికుమార్, శత్రూ, శ్రీకాంత్ అయ్యంగార్, తన్య రామచంద్రన్, రవీంద్ర విజయ్ తదితరులు నటించారు. ఈ కథకు ప్రేరణగా ఏపీ రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన నేతలు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి మధ్య ఉన్న స్నేహం, అనంతరం వారిద్దరి మధ్య ఏర్పడిన రాజకీయ విరోధతను తీసుకున్నట్టు దేవా కట్టా తెలిపారు. అయితే ఇది పూర్తిగా కల్పితమైన కథేనని, కొన్ని సంఘటనలు మాత్రం కాల్పనికంగా మలిచామని ఆయన స్పష్టం చేశారు. ఒకే లక్ష్యంతో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఇద్దరు స్నేహితులు, తర్వాత దారి మార్చుకొని విడిపోయిన సందర్భాలను బలంగా చూపించనున్నట్టు చెప్పారు.తాజాగా విడుదలైన ట్రైలర్ పలు సంచలనాత్మక డైలాగ్‌లతో సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. ఇద్దరు స్నేహితులు రాజకీయ ప్రత్యర్థులుగా ఎలా మారారన్న పాయింట్‌తో ఈ వెబ్ సిరీస్‌ని రూపొందించారు. ట్రైలర్‌లోని సన్నివేశాలు, డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. జీవితంలో ఏదో సాధించాలి, ప్రజలకు అండగా నిలబడాలనే లక్ష్యంతో రాజకీయాల్లో అడుగు పెట్టిన ఇద్దరు స్నేహితుల ప్రయాణం ఎలా సాగింది? కలిసి తిరిగిన వారు రాజకీయ గమనంలో ప్రత్యర్థులుగా మారడానికి కారణాలు ఏంటి? ఇద్దరి గొప్ప స్నేహితుల మధ్య ఉండే స్నేహం, మానసిక సంఘర్షణ.. పొలిటికల్ జర్నీలో వారు ఎదుర్కొన్న పరిస్థితులను భావోద్వేగంగా మయసభ వెబ్ సిరీస్‌లో ఆవిష్కరించనున్నట్టు తెలుస్తుంది.



# బాణామతి బ్యాక్‌డ్రాప్‌లో ‘చేతబడి’ సినిమా

శ్రీ శారద రమణా క్రియేషన్స్ బ్యానర్‌పై  నంద కిషోర్ నిర్మిస్తున్న సినిమా ‘చేతబడి’. కొత్త దర్శకుడు సూర్యాస్ ఈ మూవీని నిజజీవిత సంఘటనల ఆఘారంగా తెరకెక్కించారు. తాజాగా లుక్ రిలీజ్ చేయడంతో పాటు చిత్ర విశేషాలని దర్శకుడు మీడియాతో పంచుకున్నాడు. చేతబడి.. 16వ శతాబ్దంలో మన దేశంలో పుట్టింది. రెండు దేశాలు కొట్టుకోవాలన్న రెండు దేశాలు కలవాలన్నా.. ఒక బలగం ఉండాలి. కానీ ఒక చెడు శక్తితో మనిషిని కలవకుండా అతన్ని చంపే విద్యే చేతబడి. అది ఎంత భయంకరంగా ఉంటుందో ఇప్పటికే చాలా సినిమాల్లో చూపించారు. ఇందులో చాలా విభిన్నంగా చూపిస్తున్నాం. మన శరీరంలో ప్రతిదానికి ఓ ప్రాణం ఉంటుంది. జుట్టుకు కూడా ఒక ప్రాణం ఉంటుంది. ఆ వెంట్రుకల ఆధారంగానే  ఈ సినిమా ఆధారపడి ఉంటుందని సూర్యాస్ తెలిపాడు. 1953 గిరిడ అనే గ్రామంలో యదార్థ సంఘటన ఆధారంగా చేసుకుని ఈ కథని సిద్ధం చేశారు. సీలేరు అనే గ్రామంలో 200 సంవత్సరాల క్రితం  వెదురు బొంగులు చాలా దట్టంగా ఉంటాయి. వర్షం పడినా అవి నెలలోకి దిగవు. అలాంటి మట్టిలో బతికున్న నల్లకోడిని పెట్టి అమావాస్య రోజు బాణామతి చేస్తే ఎలా ఉంటుంది అనేది ఇందులో చూపించబోతున్నామని దర్శకుడు సూర్యాస్ చెప్పుకొచ్చాడు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.